Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 346 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 జనవరి 2024 గురువారం పేజీలు : 4

## ఆ ప్రాంతాల్లో అతి శీతల గాలులు భారత వాతావరణ శాఖ హెచ్చరిక

ఢిల్లీ: భారత్ లోని చాలా రాష్ట్రాల్లో అతి శీతల గాలులు వీస్తున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లను దట్టమైన పొగమంచు కమ్ముకున్నట్లు వివరించింది. ఉత్తర ప్రదేశ్ లోని బరేలీలో అత్యల్పంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పంజాబ్, హర్యానా, ఉత్తర రాజస్థాన్, అస్సాం మధ్య ప్రాంతాలలో మధ్యస్థం నుండి దట్టమైన పొగమంచు కనిపిస్తోంది. ఢిల్లీలో ఇవాళ ఉదయం అత్యల్పంగా 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పంజాబ్, రాజస్థాన్, హర్యానా, యూపీలో చలి తీవ్రత పెరిగింది. చలి, పొగమంచు కారణంగా రైళ్లు, విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.



# ఎన్నికల ప్రధాన అస్త్రంగా... 'అయోధ్య'

## రాముడిని నమ్ముకుని ఈ సారి ఎన్నికల బరిలోకి బిజెపి!

బీజేపీని 2024 ఎన్నికల్లో కూడా రాముడే గెలిపిస్తాడా అంటే జరుగుతున్న పరిణామాలు బీజేపీ పెట్టుకున్న నమ్మకాలు అన్నీ కూడా అదే నిజం అనేలా చేస్తున్నాయి. లేకపోతే అయోధ్య రాముడి ఆలయం ప్రారంభోత్సవాన్ని బీజేపీ ఎంత ప్రతిష్టగా తీసుకుంది అన్నది కనుక చూస్తే అది అర్థం అవుతుంది. నిజానికి బీజేపీకి అయోధ్య రాముడికి మధ్య అతి పెద్ద బంధం ఉంది. దీనికి మూడున్నర దశాబ్దాల వయసు కూడా ఉంది. బీజేపీని రెండు సీట్ల నుంచి అధికారంలోకి పలు సార్లు తీసుకుని రావడం వెనక అయోధ్య రాముడు ఉన్నారు. ఇక మోడీ రెండు సార్లు దేశానికి ప్రధాని అయ్యారు.

ఆయన రెండవసారి ప్రధాని అయ్యాక పరిష్కరించిన వాటిలో అయోధ్య రామ మందిరం ఇష్యూ అంతంత ముఖ్యమైనది. దాదాపుగా అయిదు వందల ఏళ్ల క్రితం నాటి ఈ సమస్యని మోడీ పరిష్కరించి హిందువులకు ఇష్టుడిగా మారారు. బీజేపీ పొలిటికల్ ఫిలాసఫీ కూడా హిందూత్వం కాబట్టి రాముడు బీజేపీ పాలిట వరాలు ఇచ్చే దేవుడిగా మారిపోయారు. అసలు ఉందా లేదా అన్న స్థితి నుంచి పార్టీని ఎన్నో సార్లు అధికారంలోకి తెచ్చిన రాముడిని బీజేపీ దాదాపుగా చివరిగా అనుకోవచ్చు ఒక భారీ కోరికనే కోరుతోంది.

అదేంటి అంటే మోడీకి హ్యాట్రిక్ సక్సెస్ ని ఇవ్వమని. బీజేపీ అధికారంలోకి వచ్చాక రాముడికి భవ్యమైన ఆలయాన్ని బీజేపీ నిర్మించి తన భక్తిని చాటుకుంది కాబట్టి రాముడు కూడా కాషాయ పార్టీ పట్ల తన కృతజ్ఞతను చాటుకోవలన్నది వారి ఆశ. దానికి తగినట్లుగానే ఎన్నికలు ముంగిటిలో ఉన్న వేళ అయోధ్యలో రామాలయాన్ని ప్రధాని హెూదాలో నరేంద్ర మోడీ ప్రారంభిస్తున్నారు. జనవరి 22న మోడీ అయోధ్య రామాలయాన్ని ప్రారంభించడమే కాదు దేశంలో ఆ రోజును అతి పెద్ద ఆధ్యాత్మిక దినోత్సవంగా చేస్తున్నారు. ఆ రోజున ప్రతీ ఇంటా దీపాలు వెలిగించి దీపావళి చేసుకోవాలని కూడా బీజేపీ పిలుపు ఇచ్చింది. అదే సమయంలో అయోధ్యను దేశంలోని అన్ని ప్రాంతాలకూ కలుపుతూ ఆధునీకరించిన రైల్వే స్టేషన్ ఎయిర్ పోర్టులని కూడా బీజేపీ ప్రారంభించింది.

ఒక విధంగా ఆధ్యాత్మిక విప్లవానికే బీజేపీ పూనుకుంది. రానున్న కాలమంగా అయోధ్య యాత్రలే భారీ ఎత్తున సగుతాయి. అదే సమయంలో బీజేపీ కూడా దాన్ని ఇంకా బాగా ప్రచారం కూడా చేసుకుంటుంది. మొత్తానికి చూస్తే మోడీ రామ బాణాన్నే ప్రయోగించారు. ఆయన టార్గెట్ విపక్ష శిబిరం. ఇపుడు విపక్ష శిబిరంలో కొంత అయోయమం ఉంది. దానికి తోడు బీజేపీ సెంటిమెంట్ అస్త్రాన్ని తీసింది. దీన్ని ఎలా ఎదుర్కొంటారు అన్నది చూడాల్సి ఉంది. ఏది ఏమైనా బీజేపీని రాముడిని విడదీయలేమని ఆ పార్టీ నేతలు అంటూంటే విపక్షాలు సెటైర్లు వేస్తున్నాయి. మోడీ మూడవసారి కూడా ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తే మాత్రం రాముడు నిండుగా ఆశీర్వదించినట్లే అనుకోవాల్సి ఉంటుంది. .

## తెలంగాణలో 26 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ




హైదరాబాద్: తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. మొత్తం 26 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నీటిపారుదలశాఖ కార్యదర్శిగా రాహుల్ బొజ్జా, ఫైనాన్స్ కమిషన్ సభ్య కార్యదర్శిగా స్మితా సభర్వాల్, పురావస్తుశాఖ డైరెక్టర్‌గా భారతి హెూళికేరి, గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా మహేశ్ దత్ ఎక్కా, ప్రణాళికాశాఖ ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీద్, బీసీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శిగా బుర్రా వెంకటేశం, జీఏడీ కార్యదర్శిగా ఎం.రఘునందన్‌రావు, పంచాయతీరాజ్, ఆర్‌డీ కార్యదర్శిగా సందీప్ సుల్తానియా, ఆయుష్ డైరెక్టర్‌గా ఎం.ప్రశాంతి, ఫైనాన్స్, ప్లానింగ్ ప్రత్యేక కార్యదర్శిగా కృష్ణభాస్కర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా కె.శశాంక, నల్గొండ కలెక్టర్‌గా హరిచందన, జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌గా బి.ఎం.సంతోష్, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా అద్వైత్ కుమార్ సింగ్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా వల్లూరు క్రాంతి, పాడి పరిశ్రమ అభివృద్ధి సమాఖ్య డైరెక్టర్‌గా చిట్టెం లక్ష్మి, కార్మికశాఖ కార్యదర్శిగా కృష్ణ ఆదిత్య, పీసీబీ సభ్య కార్యదర్శిగా బుద్ధప్రకాశ్, మైనార్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా ఎ.ఎం.ఖానమ్, టీఎస్‌ఎంఎస్ఐడీసీ ఎండీగా ఆర్.వి.కర్ణన్, సీఎంవో జాయింట్ సెక్రటరీగా సంగీత సత్యనారాయణ.

## తెలంగాణలో మరో ఎమ్మెల్సీ ఎన్నిక.. త్వరలోనే ఎందుకు?

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో త్వరలో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికకు తెర లేవనుంది. ఎమ్మెల్సీ గా ఉన్న పల్లా రాజేశ్వరరెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయటం.. విజయం సాధించటం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన ఆయన.. ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. దీంతో.. ఆయన రాజీనామా చేసిన స్థానం ఖాళీ కావటంతో.. దీనికి సంబంధించిన ఎన్నికల త్వరలో జరగనుంది. నిబంధనల ప్రకారం చూస్తే.. తాజాగా ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి 2024 జూన్ 8 లోపు ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాను రూపొందించే ప్రక్రియను ఎన్నికల సంఘం షురూ చేసింది. దీంతో.. వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నిక జరగనుంది. కొత్త ఓటర్ల జాబితాను రూపొందించేందుకు వీలుగా నోటిఫికేషన్ ను జారీ చేశారు. డిసెంబరు 30న ఓటర్ల జాబితా నోటీసు విడుదల కానుంది. ఫిబ్రవరి 18 వరకు కొత్త ఓటర్లు తమ ఓట్లను నమోదు చేసుకునే వీలు కల్పిస్తున్నారు. ఫిబ్రవరి 21న ముసాయిదా ఓటర్ల జాబితాను రెడీ చేసి.. దాన్ని అదే నెల 24న పబ్లిష్ చేస్తారు. దీనిపై ఉన్న అభ్యంతరాలను మార్చి 14 వరకు స్వీకరిస్తారు. మార్చి 29న వాటిని పరిష్కరించి తుది జాబితాను ఏప్రిల్ 4న విడుదల చేస్తారు. దీంతో.. ఎమ్మెల్సీ ఎన్నిక హడావుడి నాలుగు జిల్లాల్లోజరగనుంది. ఈ నాలుగు జిల్లాల్లో మూడు జిల్లాల్లో అధికార కాంగ్రెస్ కు బలంగా ఉండటంతో సిట్టింగ్ స్థానం గులాబీ పార్టీ వశం కావటం అంత తేలికైన విషయం కాదన్న మాట వినిపిస్తోంది. మరేం జరుగుతుందో చూడాలి.



# నేషనల్ పాలిట్రిక్స్‌లో... తెలంగాణ కీరోల్!

## రాష్ట్రం నుంచి పెద్దల సభకు సోనియా!



హైదరాబాద్: ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాష్ట్రం నుంచి రాజ్యసభకు వెళ్లనున్నట్టు టీపీసీసీలో చర్చ జరుగుతోంది. వచ్చే ఏడాది మార్చిలో రాష్ట్రం నుంచి ఖాళీ అయ్యే మూడు రాజ్యసభ స్థానాల్లో రెండు కాంగ్రెస్ పార్టీకి దక్కనున్న నేపథ్యంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. రాజ్యసభ స్థానాలతోపాటు రాష్ట్ర శాసన మండలిలో పలు సీట్లు ఖాళీ అవుతుండటంతో.. ఎమ్మెల్సీ సీట్ల కోసం కూడా రాష్ట్ర కాంగ్రెస్‌లో పోటీ పెరిగింది. మార్చి నాటికి రెండు రాజ్యసభ స్థానాలతోపాటు గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ సీట్లు, ఒక గ్రాడ్యుయేట్, మరో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ సీట్లు ఖాళీకానున్నాయి. సొంత పార్టీ నేతలతోపాటు టీజేఎస్, సీపీఐ నేతలు కూడా ఎమ్మెల్సీ సీట్లు, ఇతర పదవులను ఆశిస్తున్నారు.

**ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకుంటే..** సోనియా గాంధీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని.. లేదంటే తెలంగాణ నుంచే ఆమెను రాజ్యసభకు ఎంపిక చేయాలని కోరుతూ ఇటీవల టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) తీర్మానం చేసి అధిష్టానానికి పంపింది. సోనియా ప్రత్యక్ష ఎన్నికలకు సిద్ధంగా ఉంటే ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో పోటీచేసే అవకాశం ఉందని.. అక్కడ ప్రియాంకా గాంధీని పోటీకి పెడితే, సోనియా తెలంగాణకు మారవచ్చని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. ఈసారి సోనియా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చనే చర్చ ఉందని.. ఈ క్రమంలో ఆమెను తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాలని టీపీసీసీ ప్రతిపాదించినట్టు తెలిసింది. దీనితో రాష్ట్ర కాంగ్రెస్‌కు రానున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకటి రిజర్వ్ అయినట్టేనని.. మరో సీటు కోసం ఏఐసీసీలో కీలక భూమిక పోషిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా యువనేత చల్లా వంశీచంద్‌రెడ్డికి ఇవ్వవచ్చని చర్చ జరుగుతోంది. మరోవైపు రాజ్యసభ పో టీలో తెలంగాణ జనసమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం పేరు కూడా వినిపిస్తోంది. ఆయనకు రాష్ట్రస్థాయిలో పదవి ఇవ్వాలని, కుదరకపోతే రాజ్యసభకు ఎంపిక చేసే అంశాన్ని పరిశీలించాలని టీపీసీసీ పెద్దలు భా విస్తున్నట్టు సమాచారం. ఆయనకు ఏ చాన్స్ దక్కుతుందన్నదానిపై చర్చ జరుగుతోంది.

**20 మందికిపైగా ఆశావహులు** : గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్ల కోసం కూడా పోటీ నెలకొంది. ప్రజా గాయకుడు అందెశ్రీతోపాటు పార్టీలోని పలువురు నేతల పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు టీజేఎస్, సీపీఐ నేతలకు ఇప్పుడే ఎమ్మెల్సీ సీట్లు ఇస్తారా, లేక భవిష్యత్తులో ఖాళీ అయ్యే స్థానాలను ఇస్తారా అన్నదానిపై స్పష్టత రాలేదు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నేతల విషయానికి వస్తే.. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయకుండా సీట్లు త్యాగం చేసినవారు, పోటీ చేసి ఓడినవారు, వివిధ కోటాల కింద తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నవారు చాలా మంది ఎమ్మెల్సీ పదవులను ఆశిస్తున్నారు. ఈ జాబితాలో షబ్బీర్‌అలీ, ఫిరోజ్‌ఖాన్, అజారుద్దీన్, అలీ మస్కతి, మహేశ్‌కుమార్‌గౌడ్, జగ్గారెడ్డి, మధుయాష్కీ, సంపత్‌కుమార్, చరణ్ కౌశిక్ యాదవ్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. తుంగతుర్తి అసెంబ్లీ సీటును త్యాగం చేసిన అద్దంకి దయాకర్‌ను మంత్రి చేయాలనుకుంటే.. ఈసారి ఎమ్మెల్సీ కోటాలోనే ఆయనకు అవకాశం ఇవ్వనున్నారని తెలుస్తోంది. లేదంటే వరంగల్ లోక్‌సభ నుంచి పోటీ చేయించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. మహేశ్‌గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వకుంటే ఎమ్మెల్సీ ఖాయమనే చర్చ జరుగుతోంది. ఇక సాహిత్య రంగం నుంచి గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అందెశ్రీ పేరు దాదాపు ఖరారైనట్టేనని తెలుస్తోంది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా చిన్నారెడ్డి పేరు ఖరారు కావచ్చని సమాచారం. నల్లగొండ–ఖమ్మం–వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎవరన్న దానిపై కాంగ్రెస్‌లో స్పష్టత రావడం లేదు. ఈ క్రమంలో ఎవరెవరికి పదవీ యోగం కలుగుతుందనేది ఉత్కంఠగా మారింది.

# సంపాదకీయం

## రేవంత్ నోట 'ఫార్మాసిటీ' రద్దు లేదన్న మాట ఎందుకు?

తొందరపాటు ప్రకటనలతో వచ్చే నష్టం..కష్టం.. ఇబ్బందుల్ని అప్పుడే ఫేస్ చేశారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. దూకుడుగా నిర్ణయాలు తీసుకోవటంతో పాటు.. పదేళ్ల కేసీఆర్ పాలనకు భిన్నంగా ఉండాలన్న బలమైన ఆకాంక్షతో నడుస్తున్న సీఎం రేవంత్.. అన్ని విషయాల్లోనూ పక్కా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే.. తనకు అత్యంత సన్నిహితంగా ఉండే వారి ఫీడ్ బ్యాక్ ఆధారంగా చేసిన ప్రకటన ఆయన్ను ఇబ్బందికి గురి చేయటమే కాదు.. కొత్త ప్రభుత్వానికి పెద్ద ఇబ్బందిగా మారింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలో రేవంత్ నోటి నుంచి కీలక వ్యాఖ్య ఒకటి వచ్చింది. దీని సారాంశం బీఆర్ఎస్ సర్కారు సిద్ధం చేసిన ఫార్మాసిటీని రద్దు చేయటం.. ఎయిర్ పోర్టు మెట్రోను క్యాన్సిల్ చేసినట్లుగా ప్రకటన చేయటం తెలిసిందే. ముఖ్యమంత్రి నోటి నుంచి వచ్చిన ఈ ప్రకటన పెను సంచలనంగా మారటంతో పాటు.. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కార్యకలాపాలపై పెను ప్రభావాన్ని చూపింది. తాను చేసిన ప్రకటన కారణంగా జరిగే నష్టాన్ని రోజుల వ్యవధిలోనే గుర్తించిన రేవంత్.. నష్టనివారణ చర్యల్ని చేపట్టారు. ఇందుకోసం సరైన సమయం కోసం వెయిట్ చేస్తున్న ఆయన.. జనవరి 1న పురస్కరించుకొని కొందరు జర్నలిస్టులు ముఖ్యమంత్రి రేవంత్‌ను ప్రత్యేకంగా కలిశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ఏళ్లకు ఏళ్లుగా సాగుతున్న సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ.. వాటి అమలుకు కేసీఆర్ ససేమిరా అనటంతో వందలాది మంది ఇబ్బంది పడుతున్న పరిస్థితి. ఇలాంటి వేళ.. రేవంత్ మాత్రం స్పష్టమైన హామీ ఇవ్వటమే కాదు.. జనవరి 1 నుంచి వంద రోజుల్లోపు సమస్యను పరిష్కరిస్తామన్న అభయాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా తాను గతంలో చేసిన ప్రకటనలతో చోటు చేసుకున్న నష్టాన్ని భర్తీ చేసే కార్యక్రమానికి తెర తీశారు. ఇందులో భాగంగా ఫార్మాసిటీని రద్దు చేయటం లేదని.. ఎయిర్ పోర్టు మెట్రోను క్యాన్సిల్ చేయటం లేదన్న మాటను పదే పదే బలంగా ఒత్తి పలికారు. ప్రజా ప్రయోజనాల్ని పరిగణలోకి తీసుకొని వాటిని స్ట్రీమ్ లైన్ చేయనున్నట్లు చెప్పిన రేవంత్.. తాజా ప్రకటనతో తొందరపాటుతో తాను చేసిన తప్పును దిద్దుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పాలి. ఫార్మాసిటీపై స్పష్టమైన ప్రకటన చేయటం ద్వారా.. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల కారణంగా చోటు చేసుకున్న కన్ఫ్యూజన్‌తో పాటు.. రాబోయే రోజుల్లో తమ ప్రభుత్వ విధానాలు ఎలా ఉంటాయన్న దానిపై స్పష్టత ఇచ్చారని చెప్పాలి. అదే సమయంలో మెట్రో విస్తరణపైనా మరింత స్పష్టత ఇచ్చినట్లుగా చెప్పాలి. మొత్తంగా చూస్తే.. ఇటీవల తాను చేసిన రెండు సంచలన ప్రకటనలకు సంబంధించి చోటు చేసుకున్న పరిణామాలతో ఎదుర్కొంటున్న ఇబ్బందిని క్లియర్ చేసే దిశగా అడుగులు వేశారని చెప్పక తప్పదు.

## ప్రజా పాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని సందర్శించి పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయందర్ రెడ్డి



జిల్లా బ్యూరో మేడ్చల్-మల్కాజ్గిరి (గరుడ వార్త) : ప్రజా పాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయందర్ రెడ్డి సూచించారు. బుధవారం, మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట్, డబిల్ పూర్, గ్రామాలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ విజయందర్ రెడ్డి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, కేంద్రాలలో దరఖాస్తుల స్వీకరిస్తున్న ప్రక్రియను స్వయంగా పరిశీలించి దరఖాస్తులను ఎలా నింపుతున్నారు అనే వివరాలు తెలుసుకున్నారు, అనంతరం అదనపు కలెక్టర్ విజయందర్ రెడ్డి, మాట్లాడుతూ ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తుకు అధికారులు తప్పనిసరిగా రసీదు అందించాలని, దరఖాసుదారులు ఏ ఏ పథకాలకు దరఖాస్తు చేశారనే వివరాలు రసీదు ఫారంలో టిక్కులు పెట్టాలని అదనపు కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం గ్రామ సభ మొదలైనప్పటి నుండి జనవరి 6 వరకు ఉంటుందని తెలిపారు. కేంద్రానికి వచ్చిన ప్రతి ఒక్కరి వద్ద నుండి చివరి దరఖాస్తు తీసుకునే వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని అదనపు కలెక్టర్ విజయందర్ రెడ్డి, తెలిపారు. ఈ కార్యక్రమాలలోవివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పాలనలో భారతదేశం త్వరలో ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది..

### కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి





జిల్లా బ్యూరో మేడ్చల్-మల్కాజ్గిరి (గరుడ వార్త) : దేశం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న ఈ సమయంలో, మనం వికసిత భారత్ సంకల్ప యాత్ర ను జరుపుకుంటున్నామని, 2008, 09 సమయంలో భారత్ ఆర్థిక వ్యవస్థని 5 బలహీన ఆర్థిక వ్యవస్థ లో ఒకటిగా చూసేవారని, ప్రధాని మోదీ సమర్థ పరిపాలన ఫలితంగానే బలమైన 5 ఆర్థిక వ్యవస్థ లలో ఒకటిగా నేడు దేశం నిలువబోతోందని కేంద్ర బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రావల్ కోల్, సైదోని గడ్డ తాండ గ్రామ పంచాయతీలలో జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్ర లో మంత్రి పాల్గొన్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సమాచార డిజిటల్ వాహనాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పదేళ్ల పాలనలో భారత్ ప్రపంచంలోనే 5వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ గా అవతరించిందని, దేశ ఆర్థిక పరిస్థితి మారుతోంది, దాని ఫలం ప్రతీ పేదవాడికి చేరువవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 10 సంవత్సరాలలో సాధించిన ప్రగతిని ఆయన వివరించారు. కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలు, లబ్ధిదారుల విజయగాథను 'వికసిత భారత్ సంకల్ప యాత్ర' చెబుతోంది. ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు పథకం ప్రయోజనాలను పొందని వారికి అందజేయడమే ఈ డిజిటల్ వాహనం ఉద్దేశమని ఆయన తెలియజేశారు. తెలంగాణ కు అందించిన నిధుల గురించి మంత్రి మాట్లాడుతూ,గ్రాంట్ ఇన్ ఎయిడ్ లో రాష్ట్రానికి రూ.2.5 లక్షల కోట్లు ఇవ్వడం జరిగిందని, రహదారుల అభివృద్ధికి రూ.93000 కోట్లు, రైల్వే ల అభివృద్ధికి గత 5 సంవత్సరాలలో రాష్ట్రానికి రూ.4500 కోట్లు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. పిఎం ఉజ్వల యోజన ద్వారా 10 ఏళ్లలో 9.5 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వడం జరిగిందని, దీని వల్ల దేశంలో మనం పొగ రహిత వంటిల్లు చూస్తున్నాం. గ్యాస్ మన దగ్గర ఉత్పత్తి బాగా తక్కువగా ఉంది.మనం బయటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం కానీ పిఎం ఉజ్వల ద్వారా రూ 600 కే మోదీ ప్రభుత్వం అందజేస్తుంది. మన ఇరుగు పొరుగు దేశాలలో ఇంత చౌకగా దొరకవు. కేవలం ప్రధాన మంత్రి ద్వారా నే ఇది సాధ్యం అయ్యింది గ్రామాలకు నీటి సరఫరా చేయాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలది, రాష్ట్ర ప్రభుత్వానిది ... కానీ ప్రతీ గ్రామాన్ని చేరుకోవడానికి హర్ ఘర్ నల్ జల్ , జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచి నీటి కుళాయి ఏర్పాటు చేశారు. 80 కోట్ల మందికి ప్రతీ నెలా 5 కిలోల బియ్యం 5 సంవత్సరాల క్రితమే ప్రారంభమైంది. చిన్న వ్యాపారాలు చేసే వారికి ఎలాంటి గ్యారంటీ లేకుండా రుణాలు ఇవ్వడం సులభతరం చేసింది మోదీ ప్రభుత్వం. వీధి వర్తకులకు పీఎం స్వానిధి ద్వారా రుణాలు మంజూరు చేసి వారి ఉన్నతికి నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తోన్న ప్రతి పథకం ప్రతీ ఇంటికి చేరుకోవాలనే లక్ష్యం తో మోదీ గ్యారంటీ వ్యాన్ వికసిత భారత్ సంకల్ప యాత్ర ద్వారా అందరికీ చేరుకుంటుంది. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వ సమాచారంతో కూడిన ఐఈసీ మెటీరియల్‌ను మంత్రి ఆవిష్కరించారు. రావల్ కోల్, సైదోని గడ్డ తాండ గ్రామ పంచాయతీ లలో ఏర్పాటు చేసిన వివిధ కేంద్ర ప్రభుత్వ స్టాళ్లను మంత్రి సందర్శించారు. వివిధ పథకాల గురించి ప్రతి ఒక్కరికి తెలియజేయడానికి మరియు ప్రజలు నేరుగా వాటి నుండి లబ్ధి పొందేందుకు ఈ వాహనాలు దేశంలో తిరుగుతున్నాయి. ప్రజలు దీనిని మోదీ గ్యారెంటీ వాహనంగా పిలుస్తున్నారని ప్రహ్లాద్ జోషి అన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలలోప్తి పొందుతారు : శరత్ చంద్రారెడ్డి

శామీర్ పేట, జనవరి 3 (గరుడ వార్త) : అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రం శామీర్ పేట లో జరిగిన ప్రజా పాలన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సుధీర్



రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జి వజ్రాష్ యాదవులు విచ్చేసి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని అన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రతి పేదవాడికి చేరవేస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ లతోపాటు పేదల సంక్షేమం కోసం మరెన్నో పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు పరుస్తా రని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలమణి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, వివిధ శాఖల అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకుల మధ్య వాగ్వివాదం

శామీర్ పేట (గరుడ వార్త) : మండల కేంద్రం శామీర్ పేటలో జరిగిన ప్రజా పాలనలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. బుధవారం జరిగిన ప్రజా పాలనకు



విచ్చేసిన మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుదర్శన్ భుజంపై చేయి వేసి నీ పెళ్లి చేస్తా అన్నడంతోనే వాగ్వివాదం చోటుచేసుకునట్లుగా తెలుస్తోంది. దీంతో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వివాదం జరిగింది. ఇరు పార్టీల నాయకులు తోపులాటలు చేసుకోగా అక్కడే ఉన్న పోలీసులు ఇరు పార్టీల నాయకులను చెదరగొట్టి ఎలాంటి గొడవ జరగకుండా చూశారు.

## ఈ నెలలో బ్యాంకులకు 12 రోజుల సెలవు

ఐసిఎఫ్ : జాతీయ, ప్రైవేటు బ్యాంకులకు ఈనెల 12 రోజుల పాటు సెలవులు వచ్చాయి. ఈ నెల 2, 4వ శనివారం సెలవు దినాలు. అలాగే ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా 1న సెలవు. సంక్రాంతిని పురస్కరించుకుని 15వ తేదీ, తిరువళ్లువర్‌డే సందర్భంగా 16వ తేదీ, ఉళవర్ తిరునాళ్ 17వ తేదీ, తైపూసం 25వ తేదీ, గణతంత్ర దినోత్సవం 26న, నాలుగు ఆదివారాలు చొప్పున మొత్తం ఈ నెల 12 రోజులు బ్యాంకులకు సెలవులు వచ్చాయి.

## శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట (గరుడ వార్త) : శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఘనంగా అన్నదానం జరిగింది. శామీర్ పేట మండలం తూముకుంట మునిసిపాలిటీ ఉప్పరపల్లి పరిధిలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద బుధవారం ఘనంగా అన్నదానం నిర్వహించారు. ఉప్పరిపల్లి పరిధిలోని ప్రజయ్



లో నివాసముంటున్న ఆంజనేయస్వామి సరోజినీ దేవి దంపతులు, కుమార్ ఉదయలక్ష్మి దంపతులు, వారి కుటుంబసభ్యులు యశషా, జైనిత్ అన్నదానం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాదం స్వీకరించారు.

## ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించిన నక్క ప్రభాకర్ గౌడ్



శామీర్ పేట (గరుడ వార్త) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, మైనంపల్లి హనుమంత రావు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాని కి నక్క ప్రభాకర్ గౌడ్ వెళ్లి శాలువాతో సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## సావిత్రిబాయి పూలే ను ప్రతి ఒక్కరికి ఆదర్శం

### గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

శామీర్ పేట (గరుడ వార్త) : సావిత్రిబాయి పూలేను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇస్రాత్ అన్నారు. బుధవారం మండల కేంద్రం శామీర్ పేటలోని గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో సావిత్రి బాయి పూలే చిత్రపటం ఏర్పాటు చేసి ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తొలి మహిళా ఉపాధ్యాయురాలని, మహిళల కొరకు ఆమె చేసిన సేవలు



చిరస్మరణీయమన్నారు. ప్రతి ఒక్కరూ సావిత్రిబాయి పూలే ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 18 సంవత్సరాలు నిండిన వారితోపాటు ఓటరు కార్డులో మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం

### కీసర ఆర్డీవో రాజేష్ కుమార్

శామీర్ పేట (గరుడ వార్త) : 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, అదేవిధంగా ఓటర్లు తమ ఓటర్ కార్డులో మార్పులు చేర్పులు ఉంటే ఈనెల 22 వరకు చేసుకోవచ్చని కీసర ఆర్డీవో రాజేష్ కుమార్ తెలిపారు. బుధవారం కీసరలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాజేష్ కుమార్ అధ్యక్షతన



అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ తరఫున హాజరైన నాయకులు ఓట్ల జాబితాను పునః పరిశీలించాల్సిందిగా ఆర్డీవోను కోరారు.

## ఆ ప్రాంతాల్లో అతి శీతల గాలులు భారత వాతావరణ శాఖ హెచ్చరిక

ఢిల్లీ: భారత్ లోని చాలా రాష్ట్రాల్లో అతి శీతల గాలులు వీస్తున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లను దట్టమైన పొగమంచు కమ్ముకున్నట్లు వివరించింది. ఉత్తర ప్రదేశ్ లోని బరేలీలో అత్యల్పంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పంజాబ్, హర్యానా, ఉత్తర రాజస్థాన్, అస్సాం మధ్య ప్రాంతాలలో మధ్యస్థం నుండి దట్టమైన పొగమంచు కనిపిస్తోంది. ఢిల్లీలో ఇవాళ ఉదయం అత్యల్పంగా 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పంజాబ్, రాజస్థాన్, హర్యానా, యూపీలో చలి తీవ్రత పెరిగింది. చలి, పొగమంచు కారణంగా రైళ్లు, విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

# రెండు మండలాలకు ఒకే పీహెచ్‌సీ

బోథ్ : బోథ్ మండలంలో 33 గ్రామ పంచాయతీలున్నాయి. సొనాల 12 గ్రామ పంచాయతీలతో నూతన మండలంగా ఏర్పడింది. 33 గ్రామ పంచాయతీలకు గతంలో సొనాలలో పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఏర్పాటు చేశారు. బోథ్ నుంచి సొనాల మండలం విడిపోవటంతో పీహెచ్‌సీ నూతన మండలంలో ఉంది. బోథ్ మండలం లో పీహెచ్‌సీ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొనాల పీహెచ్‌సీ పరిధిలో 11 ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. బోథ్, చింతలబోరి, సొనాల, ధన్నూర్, కౌఠ, మర్లపల్లి, పట్నాపూర్, పొచ్చర, అందూర్, ఘన్‌పూర్, కరత్వాడలలో ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. బోథ్‌లో సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం) ఉన్నా, గర్భిణులకు ప్రభుత్వం అందజేస్తున్న న్యూట్రిషన్ కిట్లు, నెలవారీ ఆరోగ్య పరీక్షల కోసం సొనాల పీహెచ్‌సీకి రావాల్సిన పరిస్థితి. బోథ్ మండల కేంద్రం నుంచి ధన్నూర్ ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల ప్రజలు దాదాపు 22 కిలోమీటర్లు, మర్లపెల్లి ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల ప్రజలు దాదాపు 31 కిలోమీటర్లు ప్రయాణించి సొనాల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి వస్తున్నారు. ప్రభుత్వం స్పందించి బోథ్ మండలంలోని ధన్నూర్ పరిధిలో లేదా మర్లపెల్లి పరిధిలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. బోథ్‌లో మండలంలో మరో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



అవస్థలు పడుతూ..సొనాల నూతన మండలంలోని పీహెచ్‌సీకే బోథ్, సొనాల రెండు మండలాల ప్రజలు రావాల్సిన పరిస్థితి. బోథ్ మండలం లో మరో రెండు పీహెచ్‌సీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. బోథ్, సొనాల రెండు మండలాల ఆరోగ్య ఉపకేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రతి వారం రికార్డులు అందజేసేందుకు సొనాల పీహెచ్‌సీకి ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. సమావేశాలు, సమీక్షలకు సిబ్బంది దాదాపు 20 కిలోమీటర్లు వెళుతున్నారు. పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించే వైద్యుడు మండలంలోని ప్రతి గ్రామంలో నిర్వహించి, గ్రామాల్లో పర్యటించి, ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తించాల్సి రావడం ఇబ్బందిగా మారింది.

## పులి కోసం గిరిజనులకు పునరావాసం

కడెం : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉన్న కవ్వాల్ పెద్దపులుల సంరక్షణకేంద్రాన్ని 2012లో ఏర్పాటు చేశారు. పెద్దపులుల నివాసానికి అనువైన అటవీప్రాంతం ఉందని గుర్తించిన అటవీశాఖ ఉన్నతాధికారులు పెద్దపులుల సంఖ్యను పెంచేందుకు కావల్సిన చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాను ఆనుకుని ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని అటవీప్రాంతాలనుంచి ఇక్కడకు పెద్దపులులు వచ్చేందుకు మార్గాలుండడంతో కవ్వాల్ కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగానే దట్టమైన అడవిలో, అటవీజంతువులు తిరిగేప్రాంతాల్లో ఉన్న కొన్ని గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించారు. మొదట కడెం మండలంలోని మైసంపేట, రాంపూర్‌లను కొత్తమద్దిపడిగ శివారుకు తరలిస్తున్నారు.

94ఇళ్లు.. చక్కని కాలనీ..

అడవిలో ఉన్న మైసంపేట, రాంపూర్ గిరిజన గ్రామాలను మొదటి విడతలో మైదాన ప్రాంతానికి తరలించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిధులు కేటాయించాయి. తరలింపులో కొంత ఆలస్యమైంది. నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ గతేడాది కడెం మండలంలోని కొత్తమద్దిపడిగ శివారులో పునరావాస గ్రామం(కాలనీ) ఏర్పాటు పనులు ప్రారంభించారు. కాలనీలో 94ఇళ్లు అన్ని వసతులతో నిర్మిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, సామూహిక భవనం, విశాలమైన రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తున్నారు. సీసీరోడ్లు, మురుగుకాలువలు కొంతమేర చేయాల్సి ఉండగా ఇళ్ల నిర్మాణం పూర్తయింది. చిన్నపాటి పనులే మిగిలాయి. కాలనీ ఎదుట అందమైన ఆర్చ్, ఆకట్టుకునేలా గోడలపై అటవీ జంతువుల చిత్రాలు వేయించారు. కాలనీకి సమీపంలో పెత్తర్పు, మద్దిపడిగ



మధ్యన సుమారు 220ఎకరాల సాగుభూమిని ఈ గిరిజనులకు కేటాయించి చదును చేయిస్తున్నారు. వాటికి హద్దులు ఏర్పాటు చేయాల్సి ఉంది. రెవిన్యూ, అటవీ అధికారులు సంయుక్తంగా భూమి కొలతలు తీసి హద్దులు ఏర్పాటుచేస్తే సాగుకు యోగ్యంగా మారే అవకాశముంటుంది. ఈపనులు కొంత ఆలస్యం అవుతున్నాయి. ఇప్పటికే ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ గ్రామాల గిరిజనులకు భూములు త్వరగా అప్పగిస్తే సాగు చేసుకునేందుకు అనువుగా మార్చుకునే అవకాశముంటుంది. నవంబరు నెలలోనే పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులు ఆదేశాలిచ్చినా అమలు కాలేదు. జనవరి మూడో వారంలో కాలనీని ప్రారంభించి ఆరెండు గ్రామాలను ఇక్కడికి తరలించేలా ఉన్నతాధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. పనులు త్వరగా పూర్తిచేసి సాగుభూములు, ఇళ్లను తమకు అప్పగించాలని మైసంపేట, రాంపూర్ గిరిజనులు కోరుతున్నారు.

# బ్యాంకుల్లో పాగా.. దళారుల దగా



కామారెడ్డి : సేద్యాన్ని నమ్ముకుని పంటలు పండించే కర్షకుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు నుంచి మొదలు పంట విక్రయించే వరకు వ్యాపారులు ధరల పేరిట దగా చేస్తున్నారు. వీటికి తోడు పంట రుణం తీసుకునే బ్యాంకుల్లో దళారులు పాగా వేసి నిలువుదోపిడీ చేస్తున్నారు. జిల్లాలోని బ్యాంకుల్లో వరుసగా వెలుగుచూస్తున్న ఘటనలే ఇందుకు నిదర్శనం. పలు వాణిజ్య, గ్రామీణ బ్యాంకుల్లో మధ్యవర్తులుగా చలామణి అవుతున్న దళారులు అన్నదాతలను నట్టేట ముంచుతున్న తీరుపై కథనం.

నిబంధనల ప్రకారం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంకుకు పంట రుణం కోసం వచ్చిన రైతుల వివరాలను నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత ఖాతా తీయించాల్సి ఉంటుంది. ఆపై బ్యాంకుకు చెందిన ఫీల్డ్ అధికారి రైతు సాగుచేస్తున్న పంటలను పరిశీలించాల్సి ఉంటుంది. ధరణి పోర్టల్‌లో భూముల వివరాలు తనిఖీ చేసిన తర్వాత భూ విస్తీర్ణం మేరకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణం మంజూరు చేయాల్సి ఉంటుంది.

జరుగుతోందిలా..

సిబ్బంది కొరత పేరుతో బ్యాంకు అధికారులు క్షేత్రపర్యటనలు చేయకుండానే మమ అనిపిస్తున్నారు. కొన్ని బ్యాంకుల్లోని సిబ్బంది, యంత్రాంగం మధ్యవర్తుల పైరవీలుంటేనే రుణాల మంజూరుకు ఆమోదముద్ర వేస్తున్నారు. లేదంటే కొర్రీలు పెడుతున్నారు. బ్యాంకులు నిర్దేశిత రుణ లక్ష్యం చేరేందుకు పంట రుణాల నవీకరణకు ప్రాముఖ్యం ఇస్తున్నాయి. దీనికి మధ్యవర్తుల తోడ్పాటు తీసుకుంటున్నారు. ఇదే అదనుగా మధ్యవర్తులు బ్యాంకుల వద్ద పాగా వేసి రైతులకు మాయమాటలు చెబుతూ రుణమొత్తం అందిస్తూ వడ్డీ పేరిట అందినకాడికి దండుకుంటున్నారు. దీనికి తోడు రైతుల బ్యాంకు పాసుపుస్తకంతో పాటు రసీదులు అన్నీ తమవద్దనే పెట్టుకుంటున్నారు. ఇదే దళారుల దందాకు అనుకూలిస్తోంది. వీరికి బ్యాంకర్లు సైతం పరోక్షంగా చేయూతనందిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల ఆరోగ్యబీమా, ఇతరత్రా బీమా ఏజెంట్లతోనూ కుమ్మక్కవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వారి మాటలకే ప్రాధాన్యంపిట్లం, బీర్కూర్, జుక్కల్, బిచ్కుంద, సదాశివ నగర్, లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, దోమకొండ తదితర మండలాల్లోని కొన్ని బ్యాంకుల్లో అధికారులు దళారులు చెప్పిన వారికే రుణాలు మంజూరు చేస్తుంటారు. సదాశివనగర్ మండలకేంద్రంలోని బ్యాంకులో లింగంపల్లి రైతులకు తెలియకుండానే మధ్యవర్తి రుణాలు స్వాహా చేశాడు. ఏకంగా 50 మంది రైతుల పేరిట బ్యాంకు సిబ్బందితో కుమ్మక్కై రూ.కోటి మేర రుణాలు తీసుకున్న విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. దీనిపై బ్యాంకు అధికారులు నామమాత్రంగా విచారణ జరిపిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు దళారులకే వత్తాసు పలుకుతున్న తీరుపై అన్నదాతలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.మధ్యవర్తులను నమ్మవద్దు – భార్గవ్ సుధీర్, ఎల్‌డీఎం, కామారెడ్డిబ్యాంకుల్లో మధ్యవర్తులకు స్థానం లేదు. సదాశివనగర్, లింగంపేట బ్యాంకుల్లో జరిగిన ఘటనలపై విచారణ జరుపుతున్నాం. ప్రస్తుతం యాసంగి సీజన్‌కు సంబంధించి పంట రుణాలు మంజూరు చేస్తున్నాం. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. రుణ మంజూరు విషయంలో సందేహాలుంటే బ్యాంకు అధికారులను సంప్రదించాలి.

# టెండర్లకే పరిమితం.. అన్నదాతలు సతమతం..



ఆసిఫాబాద్ : రెండేళ్ల క్రితం కుమురంభీం ఆనకట్ట పగుళ్లిచ్చి జలాశయం ప్రమాదకరంగా మారడంతోపాటు, తెగిన కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఆయకట్టు రైతుకు కన్నీరే మిగులుతోంది. నిండా నీరున్నా పంటలకు అందని దయనీయ స్థితిని వారు ఎదుర్కొంటున్నారు. సుదూరంలో ఉన్న వాగుల నుంచి పైప్‌లైన్లువేసి, ఆయిల్‌ఇంజన్లను పెట్టి సాగునీరు అందిస్తున్నారు. దీనివల్ల డీజిల్‌కే అధిక వ్యయం అవుతుందని కర్షకులు వాపోతున్నారు. పనులకు సంబంధించి టెండర్లువేసినా, గుత్తేదారులు ఎవరూ ముందుకు రావడం లేదని సంబంధిత అధికారులు అంటున్నారు. మరోమారు టెండర్ వేస్తామని చెబుతున్నారు.

కుమురం భీం జలాశయాన్ని 45వేల ఎకరాల ఆయకట్టు సామర్థ్యంతో పూర్తి చేశారు. పుష్కరకాలం క్రితమే ప్రాజెక్టు పూర్తయినా చుక్కనీరు చేలకు చేరడం లేదు. వాంకిడి మండల సమీపంలో ప్రధాన కాలువకు రెండేళ్ల క్రితం గండి పడగా, అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. రెండు చోట్ల సిమెంటు లైనింగ్ కోసం రూ.30 లక్షలతో టెండర్లు పిలిచినా గుత్తేదార్లు ముందుకు రాలేదు. మరోవైపు చాలా కాలువలకు గండ్లు పడ్డాయి. ఈ నేపథ్యంలో నీటిని వదలకపోవడంతో ప్రాజెక్టు అలంకారప్రాయంగా మిగిలింది. ఏడువేల ఎకరాలకు నీరందించడానికి కుడి కాలువను 7.5 కిలోమీటర్ల మేర తవ్వి నాలుగేళు దాటిపోయింది. కుడి కాలువ ప్రారంభంలోనే కూలిపోవడంతో ఇప్పటి వరకు నీళ్లు వదలలేదు. ఒడ్డునే ఉన్న మానిక్‌గూడ గ్రామం వరకు కాలువ కూలిపోతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కట్ట బీటలువారినా..

కుమురం భీం జలాశయ ఆనకట్ట కిలోమీటరు పొడుగునా బీటలువారడంతో పది టీఎంసీల సామర్థ్యం గల జలాశయంలో 5 టీఎంసీల నీటిని మాత్రమే ఉంచుతున్నారు. కట్ట మట్టి నమూనాలను సేకరించి వివిధ పరీక్షలు నిర్వహించడానికి రూ.5 లక్షలతో ఒక్కసారి టెండర్ పిలిచారు. మరొకసారి రూ.5 లక్షలతో టెండర్ పిలవడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కట్ట మరమ్మతులు ఎప్పుడు చేస్తారో స్పష్టత రావడం లేదు.

వట్టివాగుకు రిక్తహస్తమే...

దశాబ్ద కాలం నుంచి వట్టివాగు ప్రాజెక్టు కాలువల మరమ్మతుల కోసం అధికారులు ప్రతిపాదలను పంపడానికే సరిపోతుంది. నిధుల విడుదలలో జాప్యం కారణంగా కాలువలన్నీ ధ్వంసమైపోయి, తుంగతో నిండాయి. మరోవైపు సింగరేణి అధికారులు కైరిగూర ఉపరితల బొగ్గుగని విస్తరణలో భాగంగా జలాశయం చుట్టూ 20 హెక్టార్ల మేర పూడ్చివేశారు. జలాశయానికి నీటిని తీసుకువచ్చే కాలువలను సైతం రెండోసారి మళ్లించేశారు. బొగ్గు వ్యర్థాల కొండలు వరద నీటితో ప్రాజెక్టులో కలిసిపోవడంతో 25వేల ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ ప్రాజెక్టు కేవలం 1500 ఎకరాలకు మాత్రమే అతి కష్టం మీద నీళ్లందిస్తోంది. ఈ నీరు సైతం అన్నదాతలే కాలువలను మరమ్మతులు చేసుకుని తమ పంట చేలకు వచ్చే విధంగా చూస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం...దామోదర్ నీటిపారుదశాఖ డీఈ కుమురం భీం, వట్టివాగు జలాశయాల, కాలువల పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. మరమ్మతుల పనులకు టెండర్ పిలువగా, ఎవరు గుత్తేదారులు రాలేదు. మళ్లీ టెండర్ పిలుస్తాం. ఈ వేసవిలోనే పనులన్నింటిని పూర్తి చేసి, అన్నదాతల పంట చేలకు సాగునీరు అందిస్తాం.

# మట్టి తవ్వకాలు.. అక్రమాలకు ఆనవాళ్లు

బెల్లంపల్లి : మట్టి తవ్వకాలు.. అక్రమాలకు ఆనవాళ్లుబెల్లంపల్లిలో అక్రమ మట్టి దందా జోరుగా సాగుతోంది. రోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్లతో యథేచ్ఛగా తరలిస్తున్నారు. మొన్నటి వరకు పోచమ్మ చెరువు చుట్టూ తవ్వకాలు జరిపిన అక్రమార్కులు కాస్త దూరంగా ఉన్న సింగరేణి, ప్రభుత్వ భూముల్లోనూ పాగా వేస్తున్నారు. పట్టపగలే ట్రాక్టర్లతో వందల ట్రిప్పుల మట్టి అక్రమంగా అమ్మేస్తున్నారు. ట్రాక్టర్ల దాటికి రోడ్లే నామారూపాల్లేకుండా పోతున్నాయి. ఎక్కడ చూసినా పెద్ద గోతులే బెల్లంపల్లిలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో రహదారులు ఏర్పాటు చేస్తున్నారు. కళాశాల వెనకాల వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిపై అక్రమార్కులు కన్నేశారు. సమతలంగా ఉన్న ప్రభుత్వ భూములను గోతుల భూములుగా మార్చేస్తున్నారు. రోజూ ట్రాక్టర్లతో వందల ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు. పట్టపగలే జేస్మీబీలతో మట్టి తవ్వేస్తున్నారంటే అధికార యంత్రాంగం సహకారం ఎలా ఉందో వేరే చెప్పాల్సిన పనిలేదు. ఒక్కో ట్రిప్పుకు రూ.600 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు. ఎర్ర మట్టికి అధికంగా డబ్బులు గుంజుతున్నారు. రోజూ రూ. 4 లక్షల వరకు మట్టి కాజేస్తున్నట్లు ట్రిప్పులను బట్టి చూస్తే తెలుస్తోంది. 500కు పైగానే ట్రిప్పులను కొడుతున్నట్లు సమాచారం. దీనిపై అధికారులు నోరు మెదపడం లేదు.

అధ్వానంగా మారుతున్న దారులుట్రాక్లర్ల రాకపోకలతో రహదారులన్నీ అధ్వానంగా మారుతున్నాయి. అంబేద్కర్‌నగర్ నుంచి రవీంద్రనగర్ రోడ్డు, రవీంద్రనగర్ నుంచి పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు, అంబేద్కర్‌నగర్ నుంచి పోచమ్మ ఆలయం రోడ్ల వెంబడి ట్రాక్టర్లు నడుస్తున్నాయి. పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు గుంతలమయంగా మారింది. ట్రాక్టర్ల రాకపోకలతోనే రోడ్లు అధ్వానస్థితికి చేరుకుంటున్నాయి. పోచమ్మ చెరువు చుట్టు మట్టి తవ్వినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

# పాలమూరులో పురోగతి అంతంతే!

మహబూబ్‌నగర్: పాలమూరులో విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో పురోగతి అంతంత మాత్రమే. దివిటిపల్లిలో ఐటీ టవర్ ఏర్పాటు, అమరరాజా బ్యాటరీస్ గిగా కారిడార్‌కు శంకుస్థాపన మినహాయించి కొత్తగా పరిశ్రమలు రాలేదు. జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలకు కొత్త వైద్య కళాశాలలకు అనుమతులొచ్చాయి. జడ్చర్ల, అచ్చంపేటల్లో వంద పడకల ఆస్పత్రులు ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి శంకుస్థాపన చేశారు. విద్యారంగంలో పాలమూరుకు కొత్తగా ఉద్యానవనశాఖ కళాశాల మంజూరైంది. నారాయణపేటలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభమైంది. ఈ ఘటనలు తప్పితే 2023లో ఉమ్మడి జిల్లాలో ఆయా రంగాల్లో పెద్దగా చెప్పుకోదగిన మార్పులు, అభివృద్ధి ఏం జరగలేదు.పరిశ్రమలకు పడని ముందడుగు...

మహబూబ్‌నగర్ శివారు దివిటిపల్లిలో ఐదెకరాల్లో రూ.40కోట్లతో నిర్మించిన ఐటీ టవర్ భవనాన్ని ఈ ఏడాది మేలో అప్పటి మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. పలు సాఫ్ట్‌వేర్ పరిశ్రమలతో ఎంవోయూ చేసుకున్నా.. ప్రస్తుతం మూడు కంపెనీలు మాత్రమే తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీని ద్వారా నాలుగేళ్లలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 40వేల ఉద్యోగాలే లక్ష్యంగా ఏర్పాటు చేసినప్పటికీ దానికి అనుగుణంగా పరిశ్రమలు రాలేదు. ఇదే ప్రాంతంలో 262 ఎకరాల్లో రూ.9,500 కోట్లతో అమరరాజా బ్యాటరీస్ గిగా కారిడార్‌కు శంకుస్థాపన, భూమిపూజ జరిగింది. ఈ పరిశ్రమ పూర్తయితే 10వేల మందికి ఉపాధి లభించనున్నాయి. మూడేళ్లుగా ఊరిస్తున్న ఆహార శుద్ధి పరిశ్రమలకు ఈ ఏడాది కూడా అడుగులు పడలేదు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వీటికోసం టీఎస్ఐఐసీకి స్థలాలు కేటాయించినా పరిశ్రమలకు ఎలాంటి ముందడుగు పడలేదు. హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రధానమంత్రి గతిశక్తి పథకంలో భాగంగా ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినా ఎలాంటి పురోగతి లేదు.

చదువులపై దృష్టేదీ..

ఈ ఏడాది విద్యారంగంపై ప్రత్యేకంగా సాధించిన ప్రగతి ఏమీ లేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధి, కొత్త కోర్సులకు రూ.100కోట్లతో బడ్జెట్‌కు ప్రతిపాదనలు పంపించగా రూ.10కోట్ల మాత్రమే వచ్చాయి. ఇవీ కూడా జీతభత్యాలకే సరిపోయాయి. ఈ ఏడాదైనా ఇంజినీరింగ్, న్యాయ కళాశాలతోపాటు ఇతర కొత్త కోర్సులు వస్తాయని ఆశించగా అవేమీ నెరవేరలేదు. 'మన ఊరు–మన బడి'లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 291, వనపర్తి–183, నాగర్‌కర్నూల్–290, జోగులాంబ గద్వాల–161, నారాయణపేటలో 174 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ ఏడాది పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తారని భావించినా సగానికి పైగా పాఠశాలల్లో పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. కొల్లాపూర్‌కు ఉద్యాన కళాశాల మంజూరు చేసినా అక్కడ ఎలాంటి మౌలిక వసతులు కల్పించకపోవడంతో వనపర్తి జిల్లాకు మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నారాయణపేటలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల మంజూరైంది.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి శంకుస్థాపన..

మహబూబ్‌నగర్‌లోని పాత కలెక్టరేట్ స్థానంలో రూ.500కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే ఇక్కడే అన్ని విభాగాల వైద్య నిపుణుల సేవలు అందుబాటులోకి వస్తాయి. పనులు కూడా చురుగ్గా నడుస్తున్నాయి. కొత్త సంవత్సరంలో ఈ ఆస్పత్రి పూర్తయ్యే అవకాశాలున్నాయి. అచ్చంపేట, జడ్చర్లలో కొత్తగా వంద పడకల ఆస్పత్రులను ఈ ఏడాది మేలో అందుబాటులోకి తీసుకొచ్చారు. వనపర్తి, కొల్లాపూర్‌లో మాతాశిశు సంరక్షణ కేంద్రాలను ఈ ఏడాదిలో ఏర్పాటు చేశారు. నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు వైద్య కళాశాలలు ఈ ఏడాదే మంజూరయ్యాయి. వనపర్తి జిల్లా కేంద్రంలో టీహబ్ అందుబాటులోకి వచ్చింది. వైద్య రంగంలో చెప్పుకోదగిన అభివృద్ధి ఇవే. 2016లో ఏర్పడిన కొత్త మండలాల్లో పీహెచ్‌సీలు ఏర్పాలవుతాయని ఆశించారు. ఈ ఏడాది కూడా నిరాశే మిగిలింది. ఇప్పటికీ అక్కడి ప్రజలు పాత మండల కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు పెరుగుతున్నా.. పురిటి నొప్పుల్లో చనిపోతున్న వారి సంఖ్య పదుల సంఖ్యలోనే ఉంది. మరోవైపు ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీ కొనసాగుతోంది.

## ప్రయోగాలకు రసాయనం కరవు!

వనపర్తి : ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రయోగ పరీక్షలు ప్రధాన భూమిక పోషిస్తాయి. వంద శాతం మార్కులు సాధించేందుకు ఇవి దోహదపడతాయి. అంతటి ప్రాధాన్యమున్న ప్రయోగ పరీక్షలపై నిర్లక్ష్యం చూపుతుండటంతో ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోంది. పాఠాలను ప్రయోగపూర్వకంగా వివరిస్తే పూర్తి స్థాయిలో అవగాహన కలుగుతుంది. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రయోగపరీక్షలు 2024 ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రయోగాలకు అవసరమయ్యే రసాయనాలు, సామగ్రి కళాశాలలకు సరఫరా కాలేదు.

నాలుగేళ్లుగా ఎదురు చూపులు: కరోనా సమయంలో రెండేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రయోగపరీక్షలకు ఉపయోగపడే రసాయనాలు, పరికరాలు అందలేదు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల కళాశాలల్లో మూడు, నాలుగేళ్లుగా అందడంలేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. బ్యూరెట్, పిప్పెట్, కోనికల్ గ్లాసు, తదితర పరికరాలు కొన్ని కళాశాలల్లో తక్కువగా ఉన్నాయి. రసాయనాల్లో తాజాగా ఉండాల్సిన హైడ్రోక్లోరిక్ ఆమ్లం, సల్ఫ్యూరిక్ ఆమ్లం, నత్రికామ్లం అందుబాటులో లేవు. పాతవి కావడంతో ఆమ్లాలలోని గాఢత తగ్గిపోయి ఫలితాలు నిర్దిష్టంగా రావడం లేదు. జీవశాస్త్రానికి సంబంధించి క్రొమటోగ్రఫిలో ఎసిటోన్, ఇథైల్ ఆల్కహాల్, ఫినాప్తలీన్, పెట్రోలియం ఈథర్ ముఖ్యమైనవి. భౌతిక, రసాయనశాస్త్రంలోనూ వీటి అవసరం ఉంటుంది. ఈ అమ్లాల సీసాల బిరడాలను ఒకసారి తీసేస్తే మరో సారి ప్రయోగానికి పనికిరావు. ఇవన్నీ ఆవిరయ్యే గుణాలు కలిగి ఉంటాయి. ఏళ్ల తరబడి రసాయనాలు అందకపోతే విద్యార్థులు ప్రయోగాలు ఎలా చేస్తారనేది ఆలోచించడం లేదు.సొంత డబ్బులతోనే..: గతంలో ప్రభుత్వం ఒక్కో జూనియర్ కళాశాలకు ప్రయోగాల నిర్వహణకు రూ.25 వేలు నుంచి రూ.30 వేలు అందజేసేది. కరోనా ప్రారంభమైనప్పటి నుంచి రెండేళ్లుగా పైసా విడుదల చేయడం లేదు. కళాశాల నిర్వాహకులే చిన్నచిన్న పరికరాలు, కిరోసిన్, డిస్టిల్‌వాటర్, గ్యాస్ సిలిండర్లను సొంత డబ్బులతో సమకూర్చుకుంటున్నారు. అరకొర నిధులతో ప్రయోగ పరీక్షలను నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలోనైనా నిధులు విడుదల చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.పరీక్షలకు ముందు తెప్పిస్తాం: కరోనా కంటే ముందు ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రయోగాలకు అవసరమయ్యే రసాయనాలను అందజేసింది. అనంతరం చెల్లించడం లేదు. కొన్ని కళాశాలల్లో సరిపోయినన్ని రసాయనాలు, పరికరాలు లేవని అడుగుతున్నారు. ఎవరెవరికి అవసరమో తెలుసుకుని ఇంటర్ బోర్డుకు నివేదిక అందించాం.

# చర్యలు నామమాత్రం.. అక్రమం యథాతథం

జిన్నారం : జిల్లాలో సంచలనం సృష్టించిన అక్రమ స్థలాలకు ఇంటి నంబర్ల కేటాయింపు వ్యవహారం మరో మలుపు తిరుగుతోంది. జిన్నారం మండలం గడ్డపోతారం శివారులో గతంలో ఈ దందా వెలుగులోకి రాగా.. కేవలం పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకొని ఆ తర్వాత పట్టించుకోలేదు. తాజాగా అదే స్థలంలో ఓ కార్యాలయం నిర్వహించేందుకు తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేసిన నేపథ్యంలో కథనం.

గతంలో ఏం జరిగింది..: గడ్డపోతారం శివారులోని సర్వే నంబర్లు 72, 80, 80ఏ, 80ఏఏ, 83, 84, 85, 86ఈ పరిధిలో ఆరెకరాల భూమి ఉంది. ఈ స్థలాన్ని 2008లో లింగయ్యగారి నరేందర్‌రెడ్డి బ్యాంకు ద్వారా కొనుగోలు చేశారు. భూమి విక్రయం విషయంలో బ్యాంకు అధికారులు నిబంధనలు పాటించలేదని స్థలం యజమాని కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానంలో కేసు నడుస్తున్న నేపథ్యంలో ఆ స్థలంలో ఎలాంటి కార్యకలాపాలకు వీలులేకుండా పోయింది. దీంతో పంచాయతీ కార్యదర్శి సహకారంతో ఈ ఏడాది జూన్, జులై నెలల్లో ఖాళీ స్థలానికి 34 ఇంటి నంబర్లను అక్రమంగా కేటాయించారు.



వీటి ఆధారంగా 90కి పైగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. రియల్టర్ల మధ్య జరిగిన గొడవతో ఈ అక్రమం వెలుగుచూసింది. విచారణ చేసిన అధికారులు ఖాళీ స్థలానికి ఇంటి నంబర్లు ఇవ్వడంతో పాటు నకిలీ ఇంటి నంబర్లు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు నిర్ధారించారు. కార్యదర్శి నరేష్‌బాబును సస్పెండ్ చేశారు. సర్పంచి, వార్డు సభ్యులకు తాఖీదులు జారీ చేశారు. కారకులను వదిలేశారు.

కొనుగోలుదారులు ఒత్తిడి తేవడంతో..

గడ్డపోతారం శివారులోని ఆరు ఎకరాల ఖాళీ స్థలంలో ఇటీవల ఇనుప రేకులతో ఓ షెడ్డు నిర్మించారు. అందులో స్థిరాస్తికి సంబంధించిన కార్యలయం ఏర్పాటు చేశారు. గతంలో ఆ స్థలాన్ని కొనుగోలు చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు స్థిరాస్తి వ్యాపారులపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తిరిగి స్థలంపై పట్టు సాధించేందుకు తాత్కాలిక నిర్మాణాలకు ప్రణాళిక చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇకనైనా అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే నిజానిజాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

పాలనాధికారికి నివేదించాం- సతీష్‌రెడ్డి, డీఎల్‌పీవో

ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు ఇచ్చిన వ్యవహారంలో కార్యదర్శిని సస్పెండ్ చేశాం. పంచాయతీ పాలక వర్గానికి షోకాజు నోటీసులు అందజేశాం. మా పరిధి మేరకు చర్యలు తీసుకున్నాం. అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని పాలనాధికారికి నివేదించాం. సబ్ రిజిస్ట్రార్లపై చర్యలకు ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం. అక్రమంగా కేటాయించిన ఇంటి నంబర్లను ప్రస్తుతం బ్లాక్ చేశాం. అక్కడ ఎలాంటి కార్యకలాపాలు చేపట్టడానికి వీలులేదు.

# యువతతో ఆటలు




మెదక్ : యువతకు క్రీడలు ఎంతో ముఖ్యం. ప్రతిరోజు ఆటలాడితే మానసికంగా ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. అందుకోసం గత భారాస ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. రూ.వేలు ఖర్చు చేసి ఏర్పాటు చేసినా.. నిర్వహణ లేకపోవడంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. క్రీడా సామగ్రిని పంపిణీ చేసినా.. వాటితో ఇప్పటివరకు ఆటలు ఆడిన దాఖలాలు లేవు. జిల్లాలో దాదాపుగా అన్ని చోట్లా ఇలాంటి పరిస్థితే నెలకొంది. జిల్లాలోని క్రీడా ప్రాంగణాలపై పరిశీలనాత్మక కథనం..

మెదక్, టౌన్, తూప్రాన్, టేక్మాల్, వెల్దుర్తి, కౌడిపల్లి, శివ్వంపేట : జిల్లా వ్యాప్తంగా 21 మండలాలతో పాటు మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట పురపాలికల్లో 496 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎకరం స్థలం ఉన్న చోట వీటిని ఏర్పాటుచేయాలి. కానీ చాలా గ్రామాల్లో అనువైన స్థలం లేక కొద్దిపాటి స్థలంలో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిలేని చోట పాఠశాలల్లో ఏర్పాటు చేసి.. దానికి బోర్డుతో పాటు వ్యాయామ పరికరాలను బిగించారు. కొన్నిచోట్ల వాలీబాల్, ఖోఖో కోర్టులను ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు. కొన్ని గ్రామానికి కిలోమీటర్ దూరంలో కూడా ఉన్నాయి. వీటి గ్రామపంచాయతీలు, పురపాలికలు నిర్వహణ బాధ్యత తీసుకోవాలి. కానీ ఎక్కడ కూడా అలాంటి పరిస్థితి లేదు.

ఉపయోగం లేక..పాఠశాలల్లో, పల్లె ప్రకృతివనాల్లో ఉన్నవి తప్ప.. మిగతా చోట ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. రాళ్లు ఉన్నా పట్టించుకోవడం లేదు. క్రీడాపరికరాలు గ్రామపంచాయతీల్లో మూలుగుతున్నాయి. కేవలం వాలీబాల్ వంటివి యువకులకు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. క్రికెట్ కిట్‌లు, టీషర్టులు, ఇతర వ్యాయామ పరికరాలు గ్రామ పంచాయతీల్లోనే ఉన్నాయి.చేగుంట మండలంలో 28, నార్సింగి మండలంలో తొమ్మిది క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. మక్కరాజుపేటలో పూర్తిగా రాళ్లు, రప్పలతో ప్రాంగణం ఉంది. రుక్మాపూర్ గ్రామం మధ్యలో కేవలం గుంట స్థలంలో ఏర్పాటు చేసి వదిలేశారు. కర్నాల్‌పల్లిలో రేణుకా ఎల్లమ్మ దేవాలయం ముందే ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆడేందుకు ఏమాత్రం అనువుగా లేదు.

మెదక్ పట్టణంలో 9 ఏర్పాటు చేశారు. వాటిలో కొన్నింటిలో ఆడుతున్నారు. పాపన్నపేట మండలంలో 36 ఏర్పాటు చేయగా.. చాలా చోట్ల సరైన సౌకర్యాలు లేవు. గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల క్రీడా పరికరాలను పంపిణీ చేయలేదు.

వాహనాల పార్కింగ్‌కు..

నర్సాపూర్‌లోని 15 వార్డులు, 25వేల జనాభాకు కనీసం ఐదయినా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి. కానీ అనువైన ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేనందున రెండింటికే పరిమితం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా పేరుకు మాత్రమే అన్నట్లుగా ముగించారు. నాటిన మొక్కలు పూర్తిగా మాయం అయ్యాయి. ఖోఖో, వాలీబాల్ ఆడేందుకు ఓ నెట్ ఏర్పాటు చేశారు. వ్యాయామానికి బిగించిన ఇనుప పైపులు కనుమరుగయ్యాయి. కొందరు ప్రైవేటు వాహనాల పార్కింగ్ కేంద్రంగా మార్చేశారు. ఇంత చేశాక మండల పరిషత్ అధికారులు సదరు స్థలం తమదంటూ సూచిక బోర్డు ఏర్పాటు చేయడం గమనార్హం. మరో క్రీడా ప్రాంగణం శివాలయం వీధిలో అని ప్రకటించినా ఎక్కడ దాని జాడే లేకుండా పోయింది.

అంతటా ఒకే పరిస్థితి...

కౌడిపల్లి మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో పేరుకు మాత్రమే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. పాఠశాలల ఆవరణల్లో ఏర్పాటు చేయగా, ఎక్కడా ఇవి పూర్థిస్థాయిలో వినియోగంలో లేకుండా పోతున్నాయి.

తూప్రాన్ మండలంలో పేరుకు మాత్రమే ఏర్పాటు చేశారు. క్రీడా పరికరాలు లేకపోవడంతో అవన్నీ నిరుపయోగంగా మారాయి.

శివ్వంపేట మండలంలో క్రీడా పరికరాలను పాఠశాల, గ్రామ పంచాయతీల్లో ఉంచారు. ఎక్కడా వీటిని వినియోగించడం లేదు.

# చేతులు శుభ్రతతో వ్యాధులు దూరం

పాల్వంచ : వ్యక్తిగత పరిశుభ్రతతో ఎన్నో వ్యాధులు దరిచేరకుండా నివారించవచ్చు. ప్రమాదకరమైన వైరస్ బారినపడకుండా తప్పించుకోవచ్చు. 'కొవిడ్-19' తర్వాత ఈ అంశంపై అందరికీ అవగాహన కలిగిందనే చెప్పాలి. కానీ, పాఠశాలల స్థాయిలో విద్యార్థులు క్రమంతప్పకుండా, తగిన విధంగా చేతులు శుభ్రం చేసుకోవడం లేదు. విద్యార్థులకు ఇదో దినచర్యగా అలవాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ గతంలో సూచించింది. అయినా ఆశించిన విధంగా ఇదెక్కడా అమలు కావడం లేదు. గతేడాది నవంబరులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాఠశాలల్లో జాతీయ పౌష్టికాహార సంస్థ (ఎన్.ఐ.ఎన్.) నిర్వహించిన సర్వే కూడా ఇదే తేల్చింది. యాజమాన్యాలు, జిల్లాస్థాయి అధికారులు ఇప్పటికైనా దృష్టిసారిస్తే అనారోగ్యం పాలుకాకుండా చూడొచ్చు.

30 వేల మందిలో అవగాహన లేమి

విద్యార్థులు విధిగా కాళ్లు, చేతుల శుభ్రత పాటించేలా యాజమాన్యాలు పర్యవేక్షించాలి. ముఖ్యంగా చేతులపై క్రిములు ఎక్కువగా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. పైపైన కడుక్కొని ఎవరైనా అల్పాహారం, ఆహారం తీసుకుంటే హానికర క్రిములు కడుపులో చేరి వ్యాధులు కలిగిస్తాయి. కొన్నిసార్లు అనారోగ్య తీవ్రత ముదిరితే మరణాలూ సంభవించే అవకాశం లేకపోలేదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. భోజనం తిన్నాక నోటిని నీళ్లతో పుక్కిలించాలి. దీనివల్ల నోటి దుర్వాసన ఉండదు. పళ్లు శుభ్రంగా ఉంటాయి. ఉమ్మడి జిల్లాలో శుభ్రతపై అవగాహన కొరవడిన విద్యార్థులు 30,750 (15%) మంది ఉన్నట్లు ఎన్ఐఎన్ సర్వేలో తేలింది. వారు కూడా అలవాటుపడేలా పాఠశాలల నిర్వాహకులు చూడాలి. కావాల్సిన సబ్బులు, లిక్విడ్‌లను పాఠశాల



గ్రాంట్స్ నుంచి సమకూర్చాలి.

చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా శరీరంలోకి క్రిములు చేరకుండా నివారించుకోవడం ముఖ్యం' అని ఐక్యరాజ్య సమితి 2008లో ఉద్ఘాటించింది. ఆ ఏడాది అక్టోబరు 15 నుంచి 'అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం' నిర్వహించాలని నిర్ణయించింది.

ప్రతిరోజు అలవాటే.. -హర్షవర్దన్, 5వ తరగతి, కొండవనమాల, కొణిజర్ల మండలం పాఠశాలలో భోజనం తినే ముందు కనీసం 2 నిమిషాల పాటు చేతులను అన్ని వైపులా సబ్బుతో శుభ్రం చేసుకునేలా ఉపాధ్యాయులు అలవాటు చేయించారు. ప్రతిరోజు విద్యార్థులం అందరం ఇలా చేయడం అలవాటైంది. ఇంటి వద్ద కూడా ఇదే ఆచరిస్తున్నాం. అమ్మానాన్నలకు, తెలిసిన వారికి కూడా చేతుల పరిశుభ్రత ఆవశ్యకతను తెలియచెబుతుంటాం. మా ఇంట్లో అందరం శుభ్రత పాటిస్తాం. అలా చేస్తే.. రోగాలు దరిచేరవు-రవిబాబు, డీసీహెచ్‌ఎస్, భద్రాద్రి కొత్తగూడెం

చిన్నారుల చేతులు... క్రిములకు నిలయాలుగా మారుతుంటాయి. వారు భోజనం చేసే ముందు చేతులను రసాయనం, లేదా సబ్బుతో నురుగ వచ్చేలా రెండు నిమిషాలు రుద్దాలి. ఉంగరాలు, చేతికి దారాలుంటే అక్కడ ఇంకా ఎక్కువగా శుభ్రం చేయాలి. ప్రతి రెండు వారాలకు ఒకసారి గోళ్లు కత్తిరించుకోవాలి. లేదంటే అవి పెరిగి సందులో మట్టి, మలినాలు చేరతాయి. వాటి ద్వారా హానికర క్రిములు కడుపులోకి చేరితే టైఫాయిడ్, కడుపు నొప్పి, విరేచనాలు అయ్యే ప్రమాదముంది. మల, మూత్ర విసర్జనకు వెళ్లొచ్చాక కాళ్లు, చేతులు రెండూ బాగా శుభ్రం చేసుకునేలా పిల్లలకు అలవాటు చేయడం ఎంతో ముఖ్యం.

# నాలుగేళ్లుగా నరకయాతన

తూప్రాన్: తూప్రాన్ బైపాస్ రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం తూప్రాన్‌లోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయం నుంచి కిష్టాపూర్ రోడ్డుకు అనుసంధానంగా రామాలయం వరకు రహదారి నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.మూడు కోట్లు మంజూరు చేసింది. మొదట ఆరు నెలల పాటు మట్టి పనులు చేసి మధ్యలో నిలిపివేశారు. ఏడాది క్రితం పనులను పునఃప్రారంభించి కంకరను వేశారు. పనులు చివరి దశకు చేరుకున్న సమయంలో వివిధ కారణాలతో మళ్లీ నిలిచిపోయాయి. దీంతో గతంలో రాకపోకలు సాగించిన వాహనదారులు ఇప్పుడు కంకర రోడ్డుపై వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు మధ్యలో అక్కడక్కడ మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండడంతో రైతులు తమ పొలాలకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ బైపాస్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చాలా గ్రామాలకు మేలు..



తూప్రాన్ నుంచి కిస్తాపూర్, వెంకటాయపల్లి, నర్సంపల్లి, మల్కాపూర్, కోనాయిపల్లి(పిబి)తో పాటు సిద్దిపేట జిల్లాలోని పలు గ్రామాలకు అనుసంధానం చేసేలా అధికారులు ఆలోచన చేసి నిధులు మంజూరు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా నాలుగేళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం-మధుసూదన్, ఏఈ పంచాయతీరాజ్, తూప్రాన్

తూప్రాన్‌లో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం బీటీ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా ఒక భూమికి సంబంధించిన వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి పనులను పూర్తి చేసి వాహనదారులకు రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

# సహకార విస్తరణపై ఆశలు



సంగారెడ్డి : సహకార సంఘాల సేవలను విస్తరించనున్నారు. ప్రస్తుతమున్న వాటికి తోడు కొత్తగా సంఘాల ఏర్పాటుకు కేంద్రం రెండేళ్ల కిందట నిర్ణయం తీసుకుంది. ఇందుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. ఆ తర్వాత దీనిపై ఎలాంటి మార్గదర్శకాలు వెలువడకపోవడంతో అన్నదాతలకు ఎదురుచూపులే మిగిలాయి. ఎట్టకేలకు వారి నిరీక్షణ ఫలించనుంది. దేశ వ్యాప్తంగా రెండు లక్షల గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను కొద్ది రోజుల్లోనే ఏర్పాటు చేయనున్నట్లు తాజాగా ప్రధాని మోదీ ప్రకటించిన నేపథ్యంలో కథనం.

కొత్త మండలాలకూ ప్రయోజనం

రైతులే పాలకవర్గ సభ్యులుగా కొనసాగుతున్న సహకార సంఘాల్లో ఎరువులు, విత్తనాలతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నారు. ఈ సంఘాలు అందుబాటులో లేనిచోట రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇకమీదట కొత్తవి ఏర్పాటు కానుండటంతో వారి ఇబ్బందులు దూరం కానున్నాయి. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రెండేళ్ల కిందట జిల్లా యంత్రాంగం 13 నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రతిపాదించారు. కొత్తగా ఏర్పాటైన అమీన్‌పూర్, నాగలిగిద్ద మండలాల్లో ప్రస్తుతం ఒక్క సొసైటీ కూడా లేదు. ఆ రెండింటికి.. ఒక్కో మండలానికి రెండు చొప్పున నాలుగు సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. మరో తొమ్మిది మండలాల్లో ఒక్కో సొసైటీ మాత్రమే ఉంది. వాటిలో అదనంగా ఒక్కో పీఏసీఎస్ ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. గుమ్మడిదల, మొగుడంపల్లి, కంది, వట్‌పల్లి, మునిపల్లి, రామచంద్రాపురం, మనూరు, కంగ్టి, సిర్గాపూర్ మండలాలు ఈ ప్రతిపాదిత జాబితాలో ఉన్నాయి.

కేంద్ర నిర్ణయం అమల్లోకి వస్తే.

కొత్తగా ఏర్పడిన నాగలిగిద్ద మండల కేంద్రంతోపాటు కరాస్‌గుత్తిలోనూ సహకార సంఘం ఏర్పాటయ్యే అవకాశం ఉంది. అమీన్‌పూర్ కొత్త మండలంగా ఏర్పడింది. ఇక్కడ అమీన్‌పూర్‌తోపాటు వడక్‌పల్లిలో సహకార సంఘాలు ఏర్పాటవుతాయి. మునిపల్లి మండల కేంద్రంతోపాటు కంది మండలం కలివేముల, గుమ్మడిదల మండలం నల్లవెల్లి, మండల కేంద్రమైన మొగుడంపల్లి, కంగ్టి మండలం తడ్కల్, వట్‌పల్లి, మనూరు మండలం రాయిపల్లి, సిర్గాపూర్ మండలం వాసర్‌లో సహకార సంఘాలు ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఆదేశాలు సంఘాల ఏర్పాటుకు అవసరమైన ప్రక్రియ సహకార శాఖ ఇప్పటికే చేపట్టింది. ఇప్పటికే ఉన్న సహకార సంఘం, ప్రతిపాదిత సంఘాలకు సభ్యులు, వాటాధనం, రుణాలు తదితర వివరాలను సిద్ధం చేశారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే..: ప్రసాద్, జిల్లా సహకార అధికారి

సహకార సంఘాల పెంపునకు సంబంధించి గతంలో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. అంతలోనే సహకార సంఘాల ఎన్నికల షెడ్యూలు రావడంతో జాప్యమైంది. ఎన్నికల నేపథ్యంలో అప్పటి ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. కొత్తగా సంఘాలు ఏర్పాటు చేసే అంశం కేంద్రం పరిశీలనలో ఉంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ముందుకుసాగుతాం. ఒక్కో సంఘంలో సభ్యులు ఎంతమంది, రుణాలు, వాటాధనం తదితర వివరాలతో గతంలో ప్రభుత్వానికి సమగ్రంగా నివేదిక అందజేశాం.

జిల్లాలో మొత్తం

సహకార సంఘాలు: 53

వాటిలో సభ్యులు:71 వేలు

# పరిమితికి మించిన భారం మోయలేం?

కొత్తగూడెం : 'మహాలక్ష్మి' ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకంతో అద్దె బస్సులపై ఒక్కసారిగా భారం పెరిగినట్లు యజమానులు పేర్కొంటున్నారు. పరిమితికి మించిన ప్రయాణాలు వాహనాల కండీషన్‌నూ దెబ్బతీసేలా ఉందని చెబుతున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే బీమా పరిహారం (ఇన్సూరెన్స్ క్లెయిమ్స్) సైతం కోల్పోయే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గం వెతకాలని ఆర్టీసీ సంస్థను కోరుతున్నారు.

డీఎం ఏమంటున్నారంటే..

కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావుతో మాట్లాడుతూ 'మహాలక్ష్మి' పథకం అమలు నేపథ్యంలో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించుకునేందుకు ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నా రని తెలిపారు. అద్దె బస్సులతో సమానంగా ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. శాఖాపరమైన నిర్ణయాల మేరకు నడుచుకుంటామన్నారు.

యజమానులు, డ్రైవర్లు చెబుతున్న సమస్యలివీ..

సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం వల్ల బస్సు కండీషన్ మారుతుంది. గేర్ల మార్పిడి వంటి ప్రక్రియలో ఇంధన ఖర్చు పెరుగుతుంది. మైలేజీ తగ్గుతుంది. రోజువారీ ఇంధన ఖర్చులు అదనంగా రూ. 1,500 నుంచి రూ. 2 వేల పెరిగాయి.

గతంలో రోజుకు ఒక సర్వీసుకు రూ. 100 లీటర్ల డీజిల్ ఉపయోగించాల్సి వస్తే, రద్దీ పెరిగాక అదనంగా మరో 20 నుంచి 30 లీటర్ల వరకు పడుతోంది. ఈ క్రమంలో డీజిల్ కేఎంపీఎల్ 4.80గా మార్చాలనే డిమాండ్ ఉంది.ఎక్స్‌ప్రెస్ బస్సుల గరిష్ఠ ప్రయాణ లక్ష్యం (కేఎంఎస్) రోజుకు 400, పల్లెవెలుగుకు 300గా మార్చాలని కోరుతున్నారు.అధిక లోడ్ ఒక్కోసారి బస్సుల టైర్లు పగిలేందుకు కారణం అవుతుంది.రద్దీ రూట్‌లలో బస్సులను కంట్రోల్ చేయడం కష్టమవుతోందని కొందరు డ్రైవర్లు విధులకు గైర్హాజరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు.రద్దీ పెరిగినా, ఆర్టీసీకి సొంతంగా ఉన్న పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను చాలా వరకు డిపోలకే పరిమితం చేయడం విమర్శలకు తావిస్తోంది.ఏదైనా కారణంతో రోడ్డు ప్రమాదం జరిగితే, ఆ సమయంలో సామర్థ్యానికి మించిన ప్రయాణికులు లోపల ఉంటే మోటారు వాహన చట్టం నిబంధన ప్రకారం బీమా పరిహారం కోల్పోవాల్సి వస్తుంది. ప్రయాణికుల పరిమితి సాధ్యం కాకుంటే బస్సులు నడపడం కష్టమనే అభిప్రాయం యజమానులు, సిబ్బందిలో వ్యక్తమవుతోంది.

# చేర్యాల బీఎంసీలో కల్తీపాల కలకలం

చేర్యాల : ప్రభుత్వ అనుబంధ 'విజయ డెయిరీ' సిద్దిపేట జిల్లా చేర్యాల పాలశీతలీకరణ కేంద్రం(బీఎంసీ)లో కల్తీపాల విషయమై కొన్నాళ్లుగా గొడవ జరుగుతోంది. ఇటీవల చేర్యాల నుంచి హైదరాబాద్ ప్రధాన కేంద్రానికి వెళ్లిన ట్యాంకరులోని పాలు కల్తీవని గుర్తించి, వెనక్కి పంపారు. ఇలా రెండుసార్లు జరగడంతో వివాదానికి దారి తీసింది. దీంతో పాల ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు స్థానిక మేనేజర్‌ను నిలదీయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. చేర్యాల కేంద్రానికి తెచ్చిన పలు గ్రామాలకు చెందిన 52 డబ్బాల పాలల్లో ఉప్పు, చక్కెర కలిసిందని స్థానిక మేనేజరు అభ్యంతరం చెప్పారు. మద్దూరు మండలంలోని రెండు గ్రామాలు, కొమురవెల్లి, చేర్యాల మండలాల నుంచి ఒక్కో గ్రామానికి చెందిన పాలు ఇందులో ఉన్నాయని మేనేజరు మురళి స్పష్టం చేశారు. కొంత మంది చేసిన తప్పువల్ల స్థానిక కేంద్రం నుంచి ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లిన ఆరువేల లీటర్లు కల్తీ అయ్యాయని చెప్పారు.ఆ పల్లెల్లో పాలు తీసుకోమనిప్రకటించారు. దీంతో స్థానిక పాల ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు చేర్యాల కేంద్రానికి చేరుకుని, మేనేజరుతో వాగ్వాదానికి దిగారు. పరీక్షలు చేయకుండా ఆరోపించడం సరికాదని, ఏ రోజుకా రోజు పరీక్షించి కల్తీ ఉంటే ఆపేయాలని సూచించారు. పరీక్షలు చేయకుండా నిర్లక్ష్యం చేశారని, దీనికి ఎవరు బాధ్యులని మేనేజర్‌ను నిలదీశారు. దీంతో 2 గంటల పాటు వాగ్వాదం జరిగింది. చివరకు ఇక నుంచి అందరూ జాగ్రత్తలు



తీసుకోవాలని నిర్ణయించారు.కల్తీ పాలను పారబోశారు. ఈ విషయమై మేనేజరు మురళికి ఫోన్ చేయగా స్పందించలేదు. సిద్దిపేట జిల్లా డైరెక్టర్ గోపాల్‌సింగ్ మాట్లాడుతూ.. కొన్ని సెంటర్ల నుంచి ఉప్పు, చక్కెర కలిపిన పాలు వచ్చినట్లు గుర్తించింది నిజమేనని చెప్పారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల సంఘం అధ్యక్షులకు వివరించామన్నారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# కు.ని.కి పాట్లు

ఆదిలాబాద్ : జిల్లా వైద్యారోగ్య శాఖను అసౌకర్యాల కొరత పట్టిపీడిస్తోంది. అసలే సరిపడా వైద్యులు లేరంటే ఉన్న వాళ్ల పనితీరు అనుమానాలకు తావిస్తోంది. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల్లో నిర్లక్ష్యం కొనసాగుతోంది. జిల్లాస్థాయిలో 2016-17లో మినహాయిస్తే ఇప్పటిదాకా ఏ సంవత్సరంలోనూ నిర్దేశించిన లక్ష్యాన్ని వైద్య శాఖ పూర్తి చేయలేదు. మారుమూల ప్రాంతాలు, ప్రధానంగా 24 గంటలపాటు పని చేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ)ల్లో కనీస వసతుల్లేక కు.ని. శిబిరాలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ఆదిలాబాద్‌లోని రిమ్స్ వైద్య కళాశాలకు తరలిస్తే తప్ప చికిత్సలు చేసే పరిస్థితి లేదు.

జిల్లాలో రెండేళ్లుగా కు.ని. శస్త్రచికిత్సల నిర్వహణ గాడితప్పింది. కుటుంబ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా గత నెల 27 నుంచి ఈ నెల 24 వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. జనాభా నియంత్రణ కోసం శాశ్వత, తాత్కాలిక అంశాలను ప్రచారం చేయడమే కాకుండా కు.ని. శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంది. జిల్లాలో 27 పీహెచ్‌సీల పరిధిలో 52 మంది వైద్యులకు 38 మంది ఉంటే మరో 14 పోస్టులు ఏళ్లుగా భర్తీ కావడం లేదు. కొంతమంది వైద్యులు కు.ని. శస్త్ర చికిత్సలంటే



ఆసక్తి చూపడం లేదు. కు.ని. కార్యక్రమాల అధికారిగా ఉన్న డా.విజయసారథి చూపిస్తున్న ఆసక్తికి మిగిలిన వైద్యుల సహకారం లభించడం లేదనే విమర్శ వినిపిస్తోంది. ఈ ఏడాది 4 వేల కు.ని. శస్త్ర చికిత్సలు చేయాలనే లక్ష్యానికి ఇప్పటిదాకా కేవలం 2,251మాత్రమే చేశారంటే వాటికి వైద్యశాఖ ఇస్తున్న ప్రాధాన్యం ఏమిటో వెల్లడవుతోంది.

అన్నింటికి రిమ్స్‌కే..

గీ కు.ని.చికిత్సల్లో శాశ్వత పద్ధతిలో మహిళలకు ట్యూబెక్టమీ, పురుషులకు వేసెక్టమీ చేయాల్సి ఉంటుంది. జిల్లాలో 12 రౌండ్ ది క్లాక్ పీహెచ్‌సీల్లో కనీస వసతుల్లేక కు.ని. చికిత్సలంటే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించాల్సి రావడమే ప్రతిబంధకంగా మారుతోంది. ఫలితంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.వేలకు వేలు వెచ్చించాల్సి చేసుకోవాల్సి వస్తోంది. నార్నూర్, ఇంద్రవెల్లి, బోథ్, సిరికొండలాంటి ప్రాంతాల నుంచి వచ్చే నిరుపేదలు దూరభారంతోపాటు ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తోంది. ఈ విషయమై కు.ని. కార్యక్రమాల జిల్లా అధికారి డా.విజయసారథిని సంప్రదించగా కరోనా కారణంగా కొంత ఇబ్బందులు తలెత్తాయనీ, త్వరలో అన్ని ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు.

నమూనా పీహెచ్‌సీ పరిస్థితి ఇది..

భీంపూర్ పీహెచ్‌సీకి నాణ్యత ప్రమాణాలు పాటించే ఆసుపత్రిగా గుర్తింపు ఉంది. పైగా ఇది రౌండ్ ది క్లాక్ (24గంటల)పీహెచ్‌సీ. కానీ ఇక్కడ ఇద్దరు వైద్యులకు ఒక్కరే ఉన్నారు. నలుగురు స్టాఫ్ నర్సులకు ఇద్దరు, 12 మంది ఏఎన్ఎంలకు ఆరుగురే ఉన్నారు. కరంజీ, అర్లి(టి), ధనోర, అందర్‌బంద్ సబ్‌సెంటర్లతో ఉన్నా కు.ని. చికిత్సలు చేసే పరిస్థితి లేదు. దీంతో పాటు జిల్లాలోని మరో రౌండ్ ది క్లాక్ పీహెచ్‌సీలు తలమడుగు, బేల, నేరడిగొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, నార్నూర్, దంతన్‌పల్లి, ఇంద్రవెల్లి, గాదిగూడ, ఝరి పీహెచ్‌సీల్లో అదే పరిస్థితి. కనీస వసతుల కల్పనలేక అవరోధం ఏర్పడుతోంది.

# అంగన్‌వాడీ సేవలకు సాంకేతిక దన్ను

ఖమ్మం : మహిళా శిశుసంక్షేమ శాఖలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సాంకేతికత వెన్నుదన్నుగా నిలుస్తోంది. సేవల్లో పారదర్శకతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం పోషణ్ ట్రాకర్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు రిజిష్టర్లలో నమోదు చేసిన ప్రతి అంశాన్ని యాప్‌లో పొందుపరిచేలా దీనిని రూపొందించారు. లబ్ధిదారులకు అందించే సేవలను ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించేలా అన్ని స్థాయిల్లో డాష్‌బోర్డులకు అనుసంధానించారు. యాప్‌ను పటిష్టంగా అమలు చేసేందుకు జిల్లా అధికారయంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టింది. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లకు తర్ఫీదునిచ్చి పోషణ్ అభియాన్ విభాగం ద్వారా పర్యవేక్షిస్తుంది. తద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు లబ్ధిదారులకు పక్కాగా పథకాలు అందేలా ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం గతంలో టీచర్లకు అందించిన చరవాణిల్లో యాప్‌ను వినియోగించే విధానాన్ని కొనసాగిస్తుంది.

అన్ని వివరాలు యాప్‌లోనే నిక్షిప్తంపోషణ్ ట్రాకర్‌లో లబ్ధిదారుల వివరాలు, గృహ సందర్శన షెడ్యూల్, రోజువారీ పర్యవేక్షణ విభాగాలు ఉంటాయి. తద్వారా పనిదినాల్లో ప్రతిరోజు అంగన్‌వాడీ టీచరు కేంద్రానికి హాజరైన విషయాన్ని తెలియచేయాలి. పిల్లల హాజరును నమోదు చేయాలి. ఆహారాన్ని ఎంతమందికి పంపిణీ చేశారో పొందుపరచాలి. ప్రీస్కూల్, పర్సనల్ హైజిన్ యాక్టివిటీని ఆన్‌లైన్ చేయాలి. ప్రతినెలా పిల్లల, గర్భిణుల ఎదుగుదల పర్యవేక్షిస్తూ ఎత్తు, బరువును నమోదు చేయాలి. వ్యాక్సినేషన్ వివరాలను అప్‌లోడ్ చేయాలి.

పోషణ్ ట్రాకర్ కీలకం

అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల నమోదు నుంచి పోషకాహార పంపిణీ, ప్రీస్కూల్ కార్యక్రమాల అమలు, ఆరోగ్య సేవలు అందించే విధానంలో ట్రాకర్ కీలకంగా మారింది. ఇప్పటివరకు కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారుల లెక్కలు ఇష్టానుసారంగా ఉండేవి. ఇకపై ఒక్కో కేంద్రంలో ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారు? పోషకాహారం ఎంత మంది తీసుకుంటున్నారు? నిర్దేశిత సమయానికి అందిస్తున్నారా? గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య స్థితిగతులు ఎలా ఉన్నాయనే అంశాలపై ఊహాజనితమైన లెక్కలకు తావులేకుండా చూడాలని యోచిస్తున్నారు. తాజాగా లబ్ధిదారుల ఆధార్‌కార్డులను అప్‌లోడ్ చేసే ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిలో డాష్‌బోర్డు ద్వారా నిరంతరం అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును పర్యవేక్షించేందుకు పోషణ్ ట్రాకర్ ఉపయోగపడుతుంది. టీచర్లు కూడా సులువుగా విధులు నిర్వహించేందుకు దోహదపడుతుంది. సిబ్బంది పనితీరు ఆధారంగా ఇన్సెంటివ్స్ కూడా ప్రభుత్వం అందిస్తుంది. -సీహెచ్ సంధ్యారాణి, డీడబ్ల్యూవో

# జాతీయ రహదారికి రూ. 700 కోట్లు



ఆదిలాబాద్ : జిల్లాలో మరో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి చకచకా అడుగులు పడుతున్నాయి. జైనథ్ మండలం భోరజ్ నుంచి మహారాష్ట్ర సరిహద్దున బేల మండలం శంకర్‌గూడ వరకు ఉన్న రెండు వరుసల జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా మార్చేందుకు రూ.700 కోట్లు కేటాయించారు. హరితహారం కింద రహదారికి రెండు పక్కల మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతుండటంతో ఆ పనులు ఆపాలని జాతీయ రహదారి అధికారులు తాజాగా పాలనాధికారికి లేఖ రాశారు.

ఇప్పటికే జిల్లాలో నాలుగు వరుసల దారి నిర్మాణం కోసం సర్వే మొదలైంది. జైనథ్ మండలం భోరజ్ నుంచి మొదలై తర్నం, నిరాల, జైనథ్, దీపాయిగూడ మలుపు, కాప్రి మలుపు, బెల్గాం, బేల మండలం సిర్సన్న, బేల, కొబ్బాయి, శంకర్‌గూడ వరకు మొత్తం 33 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ శాఖ రహదారిని 2017లోనే జాతీయ రహదారిగా ఆమోదించారు. మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే ఈ జాతీయ రహదారిని నెం.353బిగా పిలుస్తున్నారు. దీన్ని నాలుగు వరుసలకు విస్తరించాలని నిర్ణయించారు.

కొనసాగుతున్న సర్వే

దారిలో ఎక్కడెక్కడ వంతెనలున్నాయి, కొత్త వంతెనలు ఎక్కడ నిర్మించాలి, భూసేకరణ ఏమేరకు అవసరం అనే దానిపై సర్వే కోసం ఓఎంఎస్ అనే ప్రైవేటు కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించారు. డ్రోన్ కెమెరాలు, క్షేత్రస్థాయిలో ఒకసారి సర్వే పూర్తి చేసిన ఈ ఏజెన్సీ మరోమారు సర్వే చేస్తోంది. పూర్తయిన సర్వే వివరాలను దిల్లీలోని రోడ్డు, రవాణా శాఖ(మినిస్ట్రీ ఆఫ్ రోడ్, ట్రాన్స్‌పోర్ట్) కార్యాలయానికి నివేదించారు. అక్కడి నుంచి అనుమతులు వచ్చాక డీపీఆర్ నివేదిక తయారుచేస్తారు. అనంతరం దిల్లీలోని స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ(ఎస్‌ఎఫ్‌సీ) ఈ డీపీఆర్ ఆమోదించాలి. ఆ తరువాతే టెండర్లు పిలుస్తారు.

100 అడుగుల నుంచి 150 అడుగులకు

ప్రస్తుతం ఈ జాతీయ రహదారి 100 అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 7 మీటర్ల (21 అడుగులు) వెడల్పుతో బీటీ దారిని నిర్మించారు. కొత్తగా నాలుగు వరుసల దారికోసం 150 అడుగుల స్థలాన్ని సేకరించనున్నారు. అంటే ఇరుపక్కల 25 అడుగుల చొప్పున భూసేకరణ చేపట్టనున్నారు. కొన్ని చోట్ల అదనంగా ఇరుపక్కల అవసరాన్ని బట్టి మరో 10 అడుగుల ఎక్కువ స్థలం సైతం సేకరిస్తారు. దీన్నిబట్టి కొన్ని చోట్ల ఈ దారి 170 అడుగుల విస్తీర్ణం వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నాలుగు వరుసల దారికోసం మధ్యలో డివైడర్ ఏర్పాటుచేసి ఇరుపక్కల 7 మీటర్ల (21 అడుగులు) చొప్పున బీటీ దారి నిర్మిస్తారు.

మొక్కలు నాటుతున్న పంచాయతీ సిబ్బంది

ఈ దారి పొడవునా పంచాయతీ సిబ్బంది హరితహారం కింద మొక్కలు నాటుతున్నారు. ఇరుపక్కల ఈ కార్యక్రమమం కొనసాగుతోంది. త్వరలో నాలుగు వరుసల దారి పనులు మొదలు కానుండడంతో వీటిని తొలగించాల్సి ఉంటుంది. అందుకే మొక్కలు నాటే పనులను ఆపాలంటూ నిర్మల్‌లోని జాతీయ రహదారుల సబ్ డివిజన్ కార్యాలయం నుంచి జిల్లా పాలనాధికారికి లేఖ రాయడంతో ఈ మొక్కలు నాటే కార్యక్రమంపై సందిగ్ధత నెలకొంది.డిసెంబరు నాటికి ప్రక్రియ పూర్తిఈ విషయమై జాతీయ రహదారుల కార్యాలయ డీఈ సుభాష్‌తో మాట్లాడుతూ నాలుగు వరుసల దారి కోసం 2022-23 సంవత్సరం బడ్జెట్‌లో రూ.700 కోట్లు కేటాయించారన్నారు. భూసేకరణ కోసం ఇందులోనే నిధులు వెచ్చిస్తారన్నారు. భూములు కోల్పోయే వారికి రెవెన్యూ అధికారుల నిర్ణయం మేరకు పరిహారం అందిస్తారని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి మాత్రం ఈ డిసెంబరు నెలలోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు.

# తడబడుతున్న ప్రగతి చక్రం!



ఆసిఫాబాద్ : ఆర్టీసీ ప్రయాణికులపై భారం పెరుగుతున్నా.. సేవల్లో మాత్రం నాణ్యత లోపిస్తోంది. మూడు నెలల్లో డీజిల్ సెస్సు, రౌండప్ పేర్లతో ఛార్జీలు పెంచారు. ఏప్రిల్, మే నెలలో రూ.కోటి చొప్పున నష్టాన్ని చవిచూసిన ఆసిఫాబాద్ డిపో.. జూన్‌లో రూ.60 లక్షలకు తగ్గడం కొంత ఊరట కలిగిస్తోంది. కానీ ఖర్చులు పెరగడం, డీజిల్‌పై రాయితీని ఎత్తివేయడంతో సంస్థపై తీవ్ర ఆర్థిక భారంతోపాటు, ప్రయాణికుల సేవలపై ప్రభావం చూపుతోంది.

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో పల్లెవెలుగు నుంచి రాజధాని వరకు అన్ని రకాల బస్సులు సంస్థకు చెందినవి 52, అద్దెవి 19 వరకు ఉన్నాయి. నిత్యం వీటితో 30,286 కి.మీ.లు తిప్పాలి. కానీ సుమారు 27వేల కి.మీ. వరకే తిప్పుతున్నారు. రోజుకు రూ.13.50 లక్షల ఆదాయం రావాల్సి ఉండగా.. రూ.10 లక్షలే సమకూరుతోంది. సుమారు 16వేల మంది ప్రయాణికులు తమ తమ గమ్యస్థానాలకు చేరుతున్నారు.

కొరవడిన సమయపాలన..

సురక్షిత ప్రయాణానికి పెట్టింది పేరుగా ఉన్న ఆర్టీసీపై ప్రయాణికులు ఆదరణ చూపుతున్నా.. ఆ స్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమవుతోంది. ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చిన రాజధాని బస్సులో వానతో ఊరిచినట్లు అందులో ప్రయాణించిన వారు చెబుతున్నారు. ఏ బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు లేవు. జిల్లాలోని చాలా చోట్ల బస్టాండ్లు లేక రోడ్ల పక్కన, చెట్ల కింద ఎండా వానలకు ఎదురుచూడాల్సిన దుస్థితి. ఉదయం మంచిర్యాల, ఆదిలాబాద్ వైపు వెళ్లే, రాత్రి వేళ హైదరాబాద్‌కు వెళ్లే హైటెక్ బస్సుల సమయపాలన లోపిస్తోందనే విమర్శలు ఉన్నాయి.

ఛార్జీల్లో తేడా..

మేలో ఒకసారి, జూన్ 9న మరోసారి డీజిల్ సెస్, రౌండప్ పేర్లతో బస్సు ఛార్జీలు పెంచారు. 30 కి.మీ.లోపు ప్రయాణానికి పెంచనట్లు చెబుతున్నా.. రౌండప్ పేరుతో పెరగడంతో అదనపు భారం పడుతోంది. ఇది వరకు రూ.5, 15, 25.. ఇలా ఉన్న ఛార్జీలను రౌండప్ పేరుతో రూ.10, 20, 30.. పెంచారు. 30 కి.మీ. దాటితే మరింత ధరలు పెరిగాయి. ఆదిలాబాద్, హైదరాబాద్ మార్గాల్లో కంటే మహారాష్ట్ర మార్గంలో నడిచే బస్సులకు ఛార్జీల్లో తేడాతో ప్రయాణికులు నష్టపోతున్నారు. ఉదాహరణకు.. జిల్లా కేంద్రం నుంచి కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డుకు 15 కి.మీ.లు ఉంటుంది. దీని ఛార్జీ రూ.20 ఉంది. ఇందులో మార్పు చేయలేదు. అదే మహారాష్ట్ర మార్గంలోని వాంకిడి జిల్లా కేంద్రం నుంచి 15 కి.మీ. ఉంటుంది. గతంలో పల్లెవెలుగు టికెట్ ధర రూ.13 ఉండేది. రౌండప్ పేరుతో రూ.20 చేశారు. మరోసారి రూ.25 పెంచారు. జూన్ 9 నుంచి రూ.30 చేశారు. అంటే కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు, వాంకిడి జిల్లా కేంద్రం నుంచి ఒకే దూరంలో ఉన్నా.. టికెట్టు ధరలో రూ.పది తేడా ఉంది. నిత్యం వాంకిడికి రాకపోకలు సాగిస్తున్న ఉద్యోగులు, వ్యాపారులు, ఇతరత్రా వారిపై రూ.20 అదనపు భారం పడుతోంది. మహారాష్ట్ర మార్గంలో నడిచే బస్సులకు ఆ రాష్ట్రం అమలు చేస్తున్న ధరలనే ఇక్కడా అమలు చేస్తున్నట్లు అధికారులు చెప్పడం గమనార్హం.

తేడా సుస్పష్టంగా..

లి తడబడుతున్న ప్రగతి చక్రం! ఈ చిత్రంలో కనిపిస్తున్న టికెట్లలో ఒకటి ఆసిఫాబాద్ డిపోకు చెందిన పల్లెవెలుగు, మరొకటి మంథని డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సుది. జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రయాణికుడు ఇక్కడి పల్లెవెలుగు బస్సులో మహారాష్ట్రలోని రాజురాకు వెళ్లాడు. రూ.90 టికెటు ధర చెల్లించాడు. సాయంత్రం మంథని డిపోనకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో తిరిగి ఆసిఫాబాద్‌కు రాగా.. రూ.80 తీసుకున్నారు. అంటే ఒకే ఊరికి ఎక్స్‌ప్రెస్ బస్సు కంటే పల్లెవెలుగు బస్సు ఛార్జి రూ.పది అధికంగా ఉండటాన్ని గమనించవచ్చు.

# జాతీయ విపత్తుగా ప్రకటించేలా చొరవ చూపాలి

మణుగూరు : ఇటీవల గోదావరికి వచ్చిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి, కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి సహాయాన్ని అందించేలా రెండు తెలుగు ముఖ్యమంత్రులు కృషి చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సూచించారు. మణుగూరులో ప్రారంభమైన సీపీఐ జిల్లా మహాసభల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై విమర్శలు చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వాలు ప్రతిపక్షాలతోపాటు సామాన్య ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. భద్రాచలంలో వివాదంగా మారిన ఐదు పంచాయతీలను తక్షణమే తెలంగాణలో కలపాలన్నారు. అనంతరం కొత్తగూడెం మాజీ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ గోదావరి ఉద్ధృతి కారణంగా జిల్లాలో ముంపునకు గురైన మండలాల్లో పూర్తిస్థాయి పరిహారం అందించాలన్నారు. వారందరికీ తక్షణమే ఎత్తైన ప్రదేశంలో శాశ్వత నివాసాలు ఏర్పాటుచేయాలన్నారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు రాంప్రసాద్, బొల్లోజు అయోధ్య, హేమంతరాంవు, ప్రసాద్, లక్ష్మికుమారి, జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఊళ్లోకి నీరు.. జనం బేజారు

నిర్మల్ : భారీ వర్షాలతో వరదలు ముంచెత్తుతుండటంతో జిల్లా కేంద్రం పేరులో ఉన్న 'నిర్మల'త్వం లోపిస్తోంది. స్థిరాస్తి వ్యాపారంతో చెరువుల కింది సాగు భూములన్నీ వెంచర్లుగా మారాయి. భూముల ధరలు పెద్ద మొత్తంలో పెరగడంతో ఇష్టారీతిన విలువైన కాలువలు, కందకాలు పలుచోట్ల ఆక్రమణల పాలవ్వడంతో రోడ్లు, కాలనీల్లోకి వరద పోటెత్తి ప్రజలు పలు కష్టాలెదుర్కొంటున్నారు.

ఎక్కడికక్కడ..

సాగు భూములను ప్లాట్లుగా చేసే సమయంలో ముందస్తు జాగ్రత్తలతో కనీస ప్రమాణాలు పాటించకుండా ఇష్టారీతిన ఏర్పాటు చేస్తూ తమ స్థిరాస్తి వ్యాపారం సాగిస్తున్నారే తప్ప ఆ తర్వాత జరిగే నష్టాలను పట్టించుకోవడం లేదు. చెరువులు, కుంటల అలుగులు, తూముల నుంచి వెళ్లే కాలువలను పూడ్చి ప్లాట్లుగా చేస్తున్నారు. చెరువుల భూములదీ అదే పరిస్థితి. కనీస నిర్వహణ లేక కురుస్తున్న భారీ వర్షాలకు పూర్తిస్థాయికి చేరుకొని కట్టల బలహీనమై ప్రమాదకరంగా



మారాయి.

ఇకనైనా..అలుగు, తూముల నుంచి నీళ్లు వెళ్లే కాలువలను పునరుద్ధరించాలి. మిగులు జలాలు సక్రమంగా వెళ్లేలా, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నిర్మాణాలు చేపట్టాలి.

కందకాలు, జౌళినాలాకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా రక్షణ కంచెలు, హద్దులు ఏర్పాటు చేసి గత విస్తీర్ణంతో కాలువలు అభివృద్ధి చేయాలి.

ప్లాస్టిక్, చెత్తాచెదారం వంటివి చేరి ప్రవాహానికి అడ్డుగా నిల్వకుండా అనువైన చోట్ల జాలీలు వంటివి ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తొలగించాలి.

మురుగు చెరువుల్లో చేరకుండా అనుకూలమైన పుర స్థలాలున్న ప్రాంతాల్లో సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించాలి.

చేప మనుగడకు, మత్స్యకారులకు తీవ్ర ఆటంకంగా మారిన గుర్రపుడెక్క తొలగింపునకు కార్యాచరణ రూపొందించాలి.

మినీ ట్యాంక్‌బండులుగా తీర్చిదిద్దితే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే అవకాశం ఉంది.

నిర్మల్‌లోని 11 గొలుసుకట్టు తటాకాల్లో ఒకటైన మంజులాపూర్‌లోని రాంసాగర్ (చిన్న) చెరువు ఇది. గతంలో సుమారు 300 ఎకరాల్లో పంట పొలాలు సాగయ్యేవి. స్థిరాస్తి వ్యాపారంతో సాగు భూములన్నీ వెంచర్లుగా మారి, పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలయ్యాయి. దీంతో ఇది పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. ఏళ్లు గడుస్తున్నా.. కనీస మరమ్మతులు చేయడం లేదు. కట్టపై ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తోంది. రెండింటిలో ఒక తూము ప్రస్తుతం పనిచేయడం లేదు. దీంతో కురిసిన భారీ వర్షాలకు అలుగు పొంగిపొర్లి సమీపంలోని ఇళ్లు, విజయనగర్ కాలనీకి వరద పోటెత్తింది.

వివరాలు..

గొలుసుకట్టు చెరువులు : 11

గతంలో ఆయకట్టు : సుమారు 1,800 ఎకరాలు

ప్రస్తుతం : 200 ఎకరాలు

కందకాల పొడవు : దాదాపు 5 కి.మీ.కు పైగా

జౌళినాలా పొడవు : దాదాపు 3 కి.మీ. వరకు

అప్పటి పాలకులు నిర్మల్ చుట్టూరా కందకాలను నిర్మించారు. ఒక్కో చోట దాదాపు 5-10 మీటర్ల వెడల్పు, 3-5 మీటర్ల లోతులో ఉండేవి. స్వర్ణ ప్రాజెక్టు జౌళినాలా ద్వారా చెరువులు నింపడంతోపాటు, పంటపొలాలు సస్యశ్యామలమయ్యేవి. ప్రస్తుతం కాలువలు, కందకాలు కబ్జాలకు గురై కుచించుకుపోయి మురుగు కాల్వలుగా మారాయి.

# ఇంటర్ పాఠ్యపుస్తకాలేవీ సారూ!

కొత్తగూడెం : విద్యార్థులు చదువుకునేందుకు, అధ్యాపకులు బోధించే పాఠాలు అర్థమయ్యేందుకు ఇంటి వద్ద పునఃశ్చరణ చేసుకునేందుకు పాఠ్యపుస్తకాలు ఎంతో అవసరం. అవి లేకుండా విద్యా బోధన కష్టం. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పుస్తకాలు లేకుండానే చదువులు సాగుతున్నాయి. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఏటా అందజేస్తారు. కానీ ఈ ఏడాది ఇంకా ఇవ్వలేదు. 2022-23 విద్యా సంవత్సరం జూన్ 15 నుంచి ఇంటర్ ద్వితీయ తరగతులు సాగుతున్నాయి. వీరికి కావాల్సిన పాఠ్యపుస్తకాలు గతేడాదిలో మిగిలి ఉన్న పుస్తకాలను అరకొరగా అందజేశారు. పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జులై ఒకటో తేదీన తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఒక్క పుస్తకం ఇవ్వకుండానే తరగతులు ప్రారంభించారు. నిబంధనల ప్రకారం పుస్తకాలను వేసవి సెలవుల్లోనే జిల్లాలకు సరఫరా చేయాల్సి ఉంటుంది. అనంతరం కళాశాలల్లో ప్రవేశాలు పొందిన వెంటనే అందజేయాలి.

విద్యార్థుల నిరీక్షణ: ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులంతా పేదలు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటారు. ఈ ఏడాది కొత్తగా కేజీబీవీల్లో, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ గురుకులాలను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన కోసం అప్‌గ్రేడ్ చేశారు. ఖమ్మం జిల్లాలో 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 46 సెక్టర్ కళాశాలల్లో(అన్ని రకాల గురుకుల జూనియర్ కళాశాలలు) 11,422 మంది విద్యార్థులకు 70,188 పాఠ్యపుస్తకాలు కావాల్సి ఉంది. భద్రాద్రి జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బా విద్యాలయాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాల గురుకులాలు 39 ఉన్నాయి. వీటిల్లో 7,102 మందికి 40 వేల పుస్తకాలు తెలుగు, ఆంగ్ల మాధ్యమ పుస్తకాలు రావాల్సి ఉంది. కొన్ని కళాశాలల్లో ప్రిన్సిపల్స్, అధ్యాపకులు సీనియర్ ఇంటర్ విద్యార్థుల నుంచి పాత పుస్తకాలను సేకరించి కొత్తగా చేరిన వారికి అందజేస్తున్నారు. ఇప్పటికైనా సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కళాశాలలు ప్రారంభమైనప్పటికీ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. సీనియర్ విద్యార్థుల నుంచి పాఠ్యపుస్తకాలను తీసుకొని కొత్తగా ప్రవేశం పొందుతున్న వారికి సర్దుబాటు చేస్తున్నాం. నూతన పాఠ్యపుస్తకాలు ఇంకా రాలేదు. సప్లిమెంటరీ పరీక్షల అనంతరం కొత్త పుస్తకాలొచ్చే అవకాశాలున్నాయి. అప్పటి వరకు పాత పుస్తకాలతో బోధన జరుగుతోంది.- సులోచనారాణి, డీఐఈవో




టోక్యో: జపాన్‌లో భూకంపం ధాటికి మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటి వరకు 62 మంది మృతులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. భవన శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ ఈ సంఖ్య మరింత పెరగొచ్చని తెలిపారు. జపాన్‌లో జనవరి 1న రిక్టర్ స్కేల్‌పై 7.6 తీవ్రతతో వచ్చిన భూకంపానికి ఇషికావా ప్రిఫెక్చర్ అతలాకుతలమైన విషయం తెలిసిందే. ముఖ్యంగా నోటో ద్వీపకల్పం తీవ్రంగా ప్రభావితమైంది. వేలాది భవనాలు కుప్పకూలాయి. మరికొన్ని ఇళ్లు మంటల్లో దగ్ధమయ్యాయి. ఈ ఘటనల్లో 62 మంది మృతి చెందడంతోపాటు మరో 300 మంది తీవ్రంగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. వీరిలో 20 మంది పరిస్థితి విషమంగా ఉందన్నారు. దాదాపు 32 వేల మంది నిరాశ్రయులుగా మారారని.. వారంతా పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నట్లు తెలిపారు. తీర ప్రాంతంలోని సుజు పట్టణంలో దాదాపు 90 శాతం ఇళ్లు ధ్వంసమైనట్లు మేయర్ మషురో ఇజుమియా తెలిపారు. ఇప్పటికీ చాలా మంది సాయం కోసం వేచిచూస్తున్నారని స్వయంగా జపాన్ ప్రధానమంత్రి ఫుమియో కిషిదా బుధవారం తెలిపారు. వారందరినీ ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహా స్థానిక యంత్రాంగాలన్నీ క్షేత్రస్థాయిలో ముమ్మరంగా సహాయక కార్యక్రమాల్లో నిమగ్నమైనట్లు వెల్లడించారు.

ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ తొలి ప్రాధాన్యమన్నారు. మరోవైపు, జపాన్‌లో బుధవారం భారీ వర్షం పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని ప్రజలను అప్రమత్తం చేసింది.

## కడపలో పారిశుద్ధ్య కార్మికులు, పోలీసుల మధ్య తోపులాట



కడప : కడపలో పారిశుద్ధ్య కార్మికులు, పోలీసుల మధ్య జరిగిన తోపులాటతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. తమ సమస్యల పరిష్కారం కోసం గత 10 రోజులగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం మున్సిపల్ అధికారులు చెత్తవాహనాలను బయటకు తీసుకుని వెళ్తుండగా కార్మికులు వారిని అడ్డుకున్నారు. సమ్మె చేస్తున్న సమయంలో వాహనాలను ఎలా బయటకు తీసుకువెళ్తారంటూ అధికారులను ప్రశ్నించారు. దీంతో మున్సిపల్ అధికారులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. పారిశుద్ధ్య కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. కార్మికులను పోలీసులు బలవంతంగా వాహనాల్లో ఎక్కించి పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకుడు రవి మాట్లాడుతూ న్యాయమైన సమస్యల సాధనకు తాము సమ్మె చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం తగదని ఆవేదనం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుతామని హెచ్చరించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. 12 మంది మృతి

గువాహటి: అస్సాంలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో 12 మంది మృతి చెందారు. 30 మందికి గాయాలయ్యాయి. గోలాఘాట్ జిల్లాలోని డెర్గావ్ సమీపంలో లారీ– బస్సు ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. 'తిలింగా మందిర్ వైపు వెళ్తోన్న బస్సు.. ఎదురుగా వస్తోన్న లారీని ఢీకొంది. ఘటనాస్థలిలోనే 10 మంది చనిపోగా.. మరో ఇద్దరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు' అని గోలాఘాట్ జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటన గురించి తెలియగానే స్థానికులు వచ్చి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.







## అంగన్‌వాడీలు మడత కాజా తీనిపిస్తే ఎలా ఉంటుందో సీఎంకి చూపిస్తాం

అమరావతి: కళ్లు తిరిగి కిందపడిన అంగన్‌వాడీని పోలీసులు ఈడ్చుకెళ్లిన ఘటన సంచలనం రేపుతోంది. మాట ఇచ్చి మడమ తిప్పిన సీఎం డౌన్ డౌన్ అంటూ అంగన్ వాడీ కార్యకర్తలు నినాదాలు చేస్తున్నారు. మమ్మల్ని పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లి ఏం చేద్దామనుకుంటున్నారని మండిపడుతున్నారు. అంగన్ వాడీలు మడత కాజా తీనిపిస్తే ఎలా ఉంటుందో సీఎంకి చూపిస్తామని హెచ్చరిస్తున్నారు. మహిళంటారు.. ముద్దులు పెడతారు.. ఆపై పోలీసులతో కొట్టిస్తారని ఓ అంగన్‌వాడీ కార్యకర్త మండిపడింది. సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు తమ ఆందోళనను ఉధృతం చేస్తున్నారు. అందులో భాగంగా ఈరోజు (బుధవారం) కలెక్టరేట్ల ముట్టడికి అంగన్వాడీలు పిలుపునిచ్చారు. దీంతో ఆయా జిల్లాల కలెక్టరేట్ కార్యాలయం దగ్గర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. తమ సమస్యలు పరిష్కరించాలని గత 23 రోజులుగా అంగన్వాడీ వర్కర్లు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. సమ్మెలో భాగంగా ఈరోజు కలెక్టర్ కార్యాలయం ముట్టడికి అంగన్ వాడి వర్కర్స్ పిలుపునివ్వడంతో దాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. ఎక్కడికక్కడ అంగన్వాడీలను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు.




అమరావతి: సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై ఈ నెల 9,10 తేదీల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ బృందం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనుంది. సీఈసీ ఆధ్వర్యంలో అధికారుల బృందం ఏపీకి రానుంది. ఓటర్ల జాబితాలో లోపాలు, జాబితా సిద్ధం కోసం అధికారులు చేస్తున్న ప్రయత్నాలు, ఫిర్యాదులపై విచారణను అధికారులు పరిశీలన చేయనున్నారు. మద్యం అక్రమ రవాణా, డబ్బు చేరవేత వంటి కార్యకలాపాల నివారణకు చెక్ పోస్ట్ ఏర్పాటు వంటి ఇతర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు బృందం వెళ్లనుంది. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో కూడా భేటీ కానుంది. రాష్ట్ర సీఈఓ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఎన్నికలతో సంబంధం ఉన్న ఇతర అధికారులతో కూడా భేటీకి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర అధికారులకు ఆదేశాలు అందాయి.




## దీక్షల విరమణ ప్రారంభం.. ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భవానీలు

విజయవాడ: నగరంలోని ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ క్రతువు ప్రారంభమైంది. పెద్ద ఎత్తున భవానీలు కనక దుర్గమ్మ సన్నిధికి తరలి వస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో రద్దీ నెలకొంది. భవానీలు గిరిప్రదక్షిణ చేసి వినాయకుడి గుడి నుంచి దర్శనం క్యూలైన్లో ప్రవేశించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేశారు.

భవానీలు ఇరుముడిని అమ్మవారికి సమర్పించిన అనంతరం మల్లేశ్వరాలయం మెట్ల మార్గం ద్వారా మల్లికార్జున మహామండప ప్రాంగణానికి చేరుకుంటారు. ఆ తర్వాత హోమగుండాల్లో నేతి కొబ్బరికాయను సమర్పించి గురుస్వామి వద్ద మాల తీయడంతో దీక్ష విరమణ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ నెల ఏడో తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి సుమారు 5 లక్షల మంది దీక్షాధారులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు




దిల్లీ: అదానీ –హిండెన్‌బర్గ్ వివాదం విషయంలో అదానీ గ్రూపునకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ప్రముఖ బిలియనీర్ జార్జ్ సోరోస్ నేతృత్వంలోని ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ నివేదిక ఆధారంగా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ దర్యాప్తును అనుమానించలేమని బుధవారం కోర్టు వెల్లడించింది. ఈ మేరకు సెబీ చేస్తోన్న దర్యాప్తులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఈ కేసు విచారణను సెబీ నుంచి సిట్‌కు బదిలీ చేయడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంది. మిగిలిన దర్యాప్తును మూడు నెలల్లోగా పూర్తి చేయాలని నియంత్రణ సంస్థను ఆదేశించింది. హిండెన్‌బర్గ్ వివాదానికి సంబంధించి 24 కేసుల్లో 22 కేసుల విచారణను సెబీ పూర్తి చేసింది. మిగతా రెండు కేసుల్లో మూడు నెలల్లోగా దర్యాప్తు పూర్తి చేయాలని సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. అలాగే 'షార్టింగ్' విషయంలో హిండెన్‌బర్గ్ మార్కెట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందా..? లేదా..? అని తనిఖీ చేయాలని ప్రభుత్వాన్ని, సెబీని ఆదేశించింది. 'వార్తా పత్రికలు, థర్డ్ పార్టీ నివేదిక ఆధారంగా సెబీని ప్రశ్నించలేం. వాటిని ఇన్‌పుట్స్‌గా పరిగణించవచ్చు. సెబీ దర్యాప్తును అనుమానించడానికి అవి ఆధారాలు కావు' అని కోర్టు వ్యాఖ్యానించింది. అదానీ గ్రూప్ తన షేర్లలో అవకతవకలకు పాల్పడుతోందని, ఖాతాల్లోనూ మోసాలు చేస్తోందంటూ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక తీవ్ర దుమారానికి దారితీసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి దాఖలైన పలు పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు.. నాలుగు పిటిషన్లపై తీర్పును వెలువరించింది. తీర్పుపై అదానీ గ్రూప్ స్పందించింది. చివరకు సత్యమే గెలిచిందంటూ ఛైర్మన్ గౌతమ్ అదానీ సంతోషం వ్యక్తం చేశారు.

**'అదానీ' షేర్ల ర్యాలీ..** అదానీ– హిండెన్‌బర్గ్ వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో గ్రూప్‌లోని నమోదిత కంపెనీల షేర్ల విలువ బుధవారం గణనీయంగా పెరిగింది. అత్యధికంగా అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేరు ధర ఓ దశలో 18 శాతం వరకు లాభపడింది. గ్రూప్‌లోని ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 9 శాతానికి పైగా పుంజుకుంది. ఈ ఒక్కరోజే 10 నమోదిత సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఓ దశలో రూ.1.18 లక్షల కోట్ల వరకు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.




దిల్లీ: మద్యం కుంభకోణం కేసులో విచారణకు హాజరుకావడం లేదని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు సమాచారం ఇచ్చారు. ఆ నోటీసులు అక్రమమని, కేజ్రీవాల్‌ను అరెస్టు చేసే ఉద్దేశంతోనే వాటిని ఇచ్చారని ఆప్ ఆరోపించింది. కేజ్రీవాల్‌కు ఇప్పటివరకు మూడుసార్లు ఈడీ నోటీసులు ఇచ్చింది. ఈ రోజు ఆయన విచారణకు హాజరుకావాల్సి ఉంది. కానీ.. తాను రావడం లేదని ఈడీకి ముఖ్యమంత్రి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఆప్ స్పందించింది. 'దర్యాప్తు సంస్థకు సహకరించడానికి కేజ్రీవాల్ సిద్ధంగా ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో ఈ నోటీసులు ఎందుకు పంపారు..? ఎన్నికల్లో ప్రచారం చేయకుండా అడ్డుకునే ప్రయత్నం ఇది. ఆయన్ను అరెస్టు చేసే ఉద్దేశం కనిపిస్తోంది' అని పార్టీ ఆరోపించింది. కాగా, మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే సీబీఐ.. కేజ్రీవాల్‌ను విచారించిన విషయం తెలిసిందే. గత ఏడాది ఏప్రిల్‌లో ఆయనను 9 గంటల పాటు ప్రశ్నించించింది. అనంతరం ఈడీ నుంచి సమన్లు వచ్చాయి.

ఇదిలా ఉండగా.. ఈ కేసులో గత ఫిబ్రవరిలో దిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా అరెస్టయ్యారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## 'వ్యూహం' సినిమాపై అక్కడే తేల్చుకోండి: నిర్మాతకు స్పష్టం చేసిన హైకోర్టు

హైదరాబాద్: 'వ్యూహం' సినిమా నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. సినిమా విడుదలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ నిర్మాత పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. సినిమా విడుదల కాకపోవడంతో రూ.కోట్లలో నష్టం వచ్చిందని నిర్మాత తరఫున న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణను సింగిల్ బెంచ్ ఈనెల 11కు వాయిదా వేసిందని తెలిపారు. స్పందించిన హైకోర్టు.. సింగిల్ బెంచ్‌లోనే తేల్చుకోవాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది.



## వారం పాటు ఉభయగోదావరి జిల్లాలో పవన్ పర్యటన..



అమరావతి, జనవరి3: జనసేన అధినత పవన్ కళ్యాణ్ ఉభయగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. రేపటి (గురువారం) నుంచి వారం రోజుల పాటు ఉభయగోదావరి జిల్లాలో జనసేనాని పర్యటన కొనసాగనుంది. మూడు రోజుల పాటు కాకినాడ, మూడు రోజుల పాటు భీమవరంలో పవన్ పర్యటించనున్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, పోటీ చేసే స్థానాలపై ప్రత్యేకంగా జనసేనాధినేత దృష్టి సారించనున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో అభ్యర్థుల ఎంపికపై తాజా పర్యటనతో పవన్ కళ్యాణ్ స్పష్టత ఇవ్వనున్నారు. పవన్ పర్యటన నేపథ్యంలో ఉభయగోదావరి జిల్లా జనసేన నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

## న్యూ ఇయర్ లో ఎరుపెక్కించిన హంస!

హలో డిసెంబర్ అంటూ హంసానందని సంప్రదాయ చీరకట్టులో అలరించిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 1వ తేది ఉదయాన్నే అమ్మడు ఎంతో పద్ధతిగా చీరందంలో కుర్రాళ్లని మురిపించింది. ఇంకే ముందు అమ్మడి చీరందానికి అంతా ఫిదా అయ్యారు. పద్దతైన చీరలో హంస కనిపించేసరికి మేమంతా అభిమానులమే అంటూ తమదైన శైలిలో కామెంట్లు షురూ చేసారు. మరి అమ్మడు న్యూ ఇయర్ ట్రీట్ ఎలా ప్లాన్ చేసింది? కొత్త ఏడాది ఇంకా అందమైన చీరకట్టులా కనిపిస్తుందని అభిమానులంతా అనుకుంటున్నారు. కానీ అమ్మడు అందరి అంచనాలకు భిన్నంగా న్యూ ఇయర్ ని చాలా హాట్ గానే సెలబ్రేట్ చేసుకుందం డోయ్. తాజాగా అమ్మడు ఇన్నర్ దుస్తుల్లో ఉన్న ఫోటోల్ని షేర్ చేసి మరింత హీటెక్కించింది. ఇదిగో ఇక్కడిలో పూల్ దూస్తుల్లో ఎరుపెక్కించే కార్యక్రమానికి తెర



తీసింది. పచ్చ రంగు బికినీలో అగ్గి పుట్టించే అందాలతో మతి చెడగొడుతుంది. అమ్మడి తడిపొడి అందాలకి మత్తెక్కాల్సిందే. ఆ రేంజ్ లో బ్యూటీని ఆవిష్కరించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ఇలా పలకరించింది. ఇక హంసా నందిని కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. హీరోయిన్ గా సినిమాలు చేసింది ఒకటి రెండు..కావడంతో ఆ రకంగా అమ్మడు పెద్దగా ఫోకస్ కాలేదు. కేవలం ఐటం పాటల్లోనే నర్తించడంతో హా...భామగానే ఫేమస్ అయింది. అప్పటి నుంచి హంసా నందిని అంటే? ఐటం నటిగానే పరిగణించారు తప్ప సొగసరి ఏనాడు హీరోయిన్ గా చూడలేదు. అసవరం మేర స్పెషల్ అప్పిరియన్స్ వరకూ పరిమితం చేసారు. ఆ రకంగా హంసానందిని ప్రతిభని పూర్తి స్థాయిలో చాటుకోలేక పోయింది. ట్యాలెంట్ ఉన్నా? అవకాశం రాకపోవడంతో అలా కమిట్ అవ్వాల్సి వచ్చింది. ఒకటవుదాం..అభినేత్రి లాంటి సినిమాల్లో హంసానందిని హీరోయిన్ అన్న సంగతి ఎంత మందికి తెలుసు? ఆ చిత్రాల్లో బాగానే ఆకట్టుకుంది. కానీ సరైన ప్యాడింగ్ లేని సినిమాలు కావడంతో కిల్ అయ్యాయి. అటుపై ఐటం గాళ్ అనే ట్యాగ్..ఇన్ స్టాలో అమ్మడి ఫోటో షూట్లు వంటివి అభిమానుల ఆలోచనల్ని పూర్తిగా మార్చేసాయి. ప్రస్తుతం అవకాశాల కోసం సీరియస్ గా ప్రయత్నాలు చేస్తుంది.

## స్ఫూర్తి నింపిన సమంత నో మేకప్ లుక్

అద్భుతమైన నటన, ఫ్యాషన్ సెన్స్ తో నిరంతరం ప్రజల దృష్టిని తనవైపు తిప్పేసుకోవడం ఎలానో సమంతకు తెలిసినట్టుగా ఇంకెవరికీ తెలీదేమో! ఫిట్ నెస్ ఫ్రీక్ సమంత లుక్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. అభిమానుల్లో స్ఫూర్తి నింపే గొప్ప వ్యక్తిత్వం సమంతను ఇప్పటికే గొప్ప సెలబ్రిటీగా ఆవిష్కరించింది. సోషల్ మీడియాలోను సామ్ ఎంతో యాక్టివ్‌గా ఉంటుంది. ఇన్ స్టాలో నిరంతరం తన వ్యక్తిగత అప్‌డేట్‌లను షేర్ చేస్తుంది. ఇటీవల డిజిటల్ మాధ్యమంలో తన వ్యక్తిగత ప్రసార ఛానెల్‌ని ప్రారంభించింది. సమంత సామాజిక మాధ్యమాలలో తన అనుచరులతో ఘాడమైన అనుబంధాన్ని కలిగి ఉంది. తాజాగా నో-మేకప్ సెల్ఫీని షేర్ చేసింది. ఈ లుక్ లో ఎప్పటిలాగే అందంగా కనిపిస్తోంది. ప్రస్తుతం సామ్ నో మేకప్ లుక్‌పై నెటిజనుల్లో ప్రశంసలు కురుస్తున్నాయి. సామ్ దశాబ్దం పైగానే తన అందం సింప్లిసిటీతో మనసులు దోచుకుందని అభిమాను



లు కితాబిచ్చేస్తున్నారు. కొన్ని క్లిష్ట పరిస్థితుల్లోను సామ్ తనను తాను నిలబెట్టుకుంటూ అందరికీ ప్రేరణనిచ్చిందని అభిమానులు ప్రశంసిస్తున్నారు. సామ్ తనలోని విలక్షణతను ఎప్పుడూ దాచుకోకుండా అందరికీ చెబుతుంది...దాపరికం లేని నటి! అది తన ప్రత్యేకత అని ఒక అభిమాని సోషల్ మీడియాల్లో ప్రశంసించారు. ఓవరాల్ గా సామ్ నో మేకప్ లుక్ కి అద్భుత స్పందన వచ్చింది. ముఖ్యంగా తన వ్యక్తిత్వాన్ని ప్రశంసించేందుకు అభిమానులు వెనకాడలేదు. ప్రస్తుతం నో మేకప్ లుక్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. సమంత రూత్ ప్రభు మయోసైటిస్ కి చికిత్స తీసుకుని ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో సినిమాల్లో నటించేందుకు సిద్ధమవుతోంది. తదుపరి భారీ ప్రాజెక్ట్‌లతో అలరించేందుకు సిద్ధంగా ఉంది. ఈ సంవత్సరంలో దేవరకొండ సరసన ఖుషి చిత్రంలో నటించిన సమంత ఓటీటీ కోసం సిటాడెల్ భారతీయ వెర్షన్ లో వరుణ్ ధావన్ సరసన నటించిన సంగతి తెలిసిందే. ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 2లో నటించిన సామ్ మరోసారి డైనమిక్ డైరెక్టర్ ద్వయం రాజ్ & డికెతో కలిసి పని చేసింది. కొత్త సంవత్సరంలో సిటాడెల్ కోసం ప్రచారానికి సమంత సిద్ధమవుతోందని సమాచారం. తదుపరి కొన్ని ప్రాజెక్టుల గురించి సమంత స్వయంగా ప్రకటించే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది.




## ఆ రెండు సెంటిమెంట్లు కలిసి వస్తే నా సామి రంగ...!



నాగార్జున హీరోగా రూపొందిన నా సామి రంగ సినిమా ఈ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మరో పది రోజుల్లో విడుదల అవ్వబోతున్న నా సామి రంగ సినిమా పై పాజిటివ్ బజ్ క్రియేట్ చేయడంలో చిత్ర యూనిట్ సభ్యులు సఫలం అయ్యారనే చెప్పాలి. ఈ సినిమాలోని నాగార్జున లుక్ మరియు ఇతర విషయాలు చాలా వరకు సినిమా పై ప్రేక్షకుల్లో ఆసక్తిని మరియు అంచనాలు పెంచుతున్నాయి అనడంలో సందేహం లేదు. నా సామి రంగ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయబోతున్న నేపథ్యం లో సెంటిమెంట్ వర్కౌట్ అవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

గతంలో సంక్రాంతి కానుకగా వచ్చిన సోగ్గాడే చిన్ని నాయన మరియు బంగార్రాజు సినిమాలు విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఆ సెంటిమెంట్ నా సామి రంగ కి తప్పకుండా వర్తిస్తుంది.. తప్పకుండా విజయం దక్కించుకుంటుంది అనే నమ్మకం వ్యక్తం అవుతోంది. మరోవైపు నాగార్జున ఇప్పటి వరకు చాలా మంది కొత్త దర్శకులతో సినిమాలు చేశాడు. చాలా మంది దర్శకులను ఇండస్ట్రీకి పరిచయం చేశాడు. వాటిల్లో మెజార్టీ సినిమాలు హిట్ అయ్యాయి. కొత్త వారితో చేసిన సినిమాల్లో ఎక్కువ హిట్ అవ్వడంతో నా సామి రంగ కూడా హిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటూ కొందరు ఫ్యాన్స్ ధీమాతో ఉన్నారు. నా సామి రంగ సినిమాను ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ రూపొందించాడు. దర్శకుడిగా మొదటి సారి అయినా కూడా ఈ సినిమాను అద్భుతంగా రూపొందించాడు అన్నట్లుగా యూనిట్ సభ్యులు ఆయనపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

నాగార్జునతో పాటు ఈ సినిమాలో అల్లరి నరేష్ మరియు రాజ్ తరుణ్ లు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ముగ్గురు హీరోల సినిమా అవ్వడంతో అసలైన సంక్రాంతి వినోదాల విందును కచ్చితంగా నా సామిరంగ మాత్రమే అందిస్తుంది అనే నమ్మకం వ్యక్తం అవుతోంది. మరి ఫలితం ఎలా ఉంటుంది.. ఈ రెండు సెంటిమెంట్లు వర్కౌట్ అయ్యేనా చూడాలి.

## కల్కి రిలీజ్ ట్విస్ట్.. ట్రైలర్ వచ్చేది అప్పుడే




పాన్ ఇండియా హీరో ప్రభాస్ అభిమానులంతా సలార్ సక్సెస్ ను మస్త్ గా ఎంజాయ్ చేస్తున్నారు. మూడు ఫ్లాపుల తర్వాత ప్రభాస్ హిట్ కొట్టడంతో సంబరాలు చేసుకుంటున్నారు. ఆ సంబరాలను ఇప్పుడు డబుల్ చేశారు డైరెక్టర్ నాగ్ అశ్విన్. ప్రభాస్ తో ఆయన తెరకెక్కిస్తున్న కల్కి 2898 ఏడీకి సంబంధించి క్రేజ్ అప్డేట్స్ ఇచ్చారు. సైన్స్ ఫిక్షన్ జానర్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి రిలీజైన పోస్టర్లు, గ్లింప్స్ ఇప్పటికే ఊహించని స్థాయిలో అంచనాలు పెంచేశాయి. తాజాగా కల్కి మూవీకి సంబంధించి అదిరిపోయే అప్డేట్స్ ఇచ్చారు నాగ్ అశ్విన్. IIT బాంబే టెక్ ఫెస్ట్ 23లో పాల్గొన్న ఆయన పలు విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఎప్పుడో చెప్పేశారు. కల్కి మూవీ ట్రైలర్ ను మరో 93 రోజుల్లో రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు నాగ్ అశ్విన్. ఆ ప్రకారం చూస్తే ఏప్రిల్ తొలి వారంలో ఈ సినిమా ట్రైలర్ విడుదల అవ్వనుందన్నమాట. ఈ మూవీని ఎప్పుడు విడుదల చేయాలనుకుంటున్నది త్వరలోనే చెబుతామని, అయితే కచ్చితమైన తేదీ గురించి ఇప్పట్లో స్పష్టత లేదని అన్నారు. కల్కికి సీక్వెల్ ఉందో లేదో రిలీజ్ డేట్ ప్రకటించినప్పుడు చెప్పానని అన్నారు నాగ్ అశ్విన్. ఈ మూవీ కోసం మహానటి కన్నా ముందు నుంచే ఎప్పటి నుంచో అనుకుంటున్నట్లు తెలిపారు. కల్కి ఓ స్టాండ్ అలోన్ ఫిల్మ్ అని, స్టోరీకి తగ్గట్లు పేరు పెట్టినట్లు నాగ్ అశ్విన్ చెప్పారు. మైథాలిజీతో టెక్నాలజీని మిక్స్ చేసి ఆసక్తికరంగా చిత్రీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రం కల్కి యూనివర్స్ లేదా నాగీ యూనివర్స్ లో ఎలాంటి భాగం కాదని స్పష్టం చేశారు. హాలీవుడ్ ఫిల్మ్ టామ్ క్రూజ్ లో లాంటి ఫైట్ సీన్స్ ఉండవని తెలిపారు. సినిమాలో వీఎఫ్ ఎక్స్ కోసం చాలా కష్టపడుతున్నట్లు వెల్లడించారు. వైజయంతీ మూవీస్ బ్యానర్ పై సీనియర్ నిర్మాత అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సుమారు రూ.600 కోట్ల బడ్జెట్ తో అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నారు. బాలీవుడ్ లెజెండరీ యాక్టర్ అమితాబ్ బచ్చన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. దీపికా పదుకొణె, దిశా పటానీ, దుల్కర్ సల్మాన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.

## ఈత కొలనులో హబ్బీతో మౌని సరాగాలు

ఇటీవల తన స్నేహితురాలు దిశా పటానీతో కలిసి దుబాయ్ వెకేషన్ ని ఎంజాయ్ చేసింది మౌనిరాయ్. ఈ ట్రిప్ లో దిశా-మౌని మధ్య గొప్ప స్నేహం చూసి కొందరు కుళ్లుకున్నారు. ఇది స్వలింగసంపర్క ప్రేమ! అని కామెంట్లు చేసినవారు ఉన్నారు. కానీ ఇప్పుడు తన వెకేషన్ నుంచి ఒక అరుదైన వీడియోని అభిమానుల కోసం షేర్ చేసింది. ఈ వీడియోలో తన భర్తతో కలిసి ఈత కొలనులో ఎంజాయ్ చేస్తోంది మౌని. హబ్బీతో సరాగాలు కుర్రకారు గుండెల్ని టచ్ చేసాయి. మౌనిరాయ్ వెరీ లక్కీ.. తన జీవితాన్ని తనకు నచ్చినట్టుగా ఆస్వాధిస్తోంది. పెళ్లయాకా ఇస్పీడ్ ఎంతమాత్రం తగ్గలేదు!.. అంటూ కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ స్పెషల్ వీడియో అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఈ వీడియోకి మౌని ఒక స్పెషల్ కోట్ ని కూడా రాసింది. మేల్కొలపండి, కాఫీ, ఈత కొట్టండి, తినండి,



మళ్లీ చదవండి ..అని రాసింది. చప్రేమ జీవితం అంటూ హ్యాష్ ట్యాగ్ ని జోడించింది.

**ఇంతకీ ఎవరీ మౌని? :** ఒక చిన్న పట్టణం నుండి ముంబైకి మౌని రాయ్ ఆసక్తికర ప్రయాణం గురించి హిందీ మీడియాలో ఎన్నో కథనాలొచ్చాయి. ప్రతిభ పట్టుదలతో అనుకున్నది సాధించుకున్న మేటి నటీమణిగా మౌని నిరూపించింది. ఈ బ్యూటీ నటిగా హోస్ట్ గాను మనసులు గెలుచుకుంది. ఇటీవలి షోలు సుల్తాన్ ఆఫ్ ఢిల్లీలో ప్రత్యేక పాత్రతో..టెంప్టేషన్ ఐలాండ్... షోతో హోస్ట్ గా మెరిపించింది. మౌని కేవలం ఒక నటిగానే కాదు.. వ్యవస్థాపకురాలిగాను ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది. ఆమె రెస్టారెంట్ చైన్ బద్మాష్‌ని ప్రారంభించి దాని 7వ అవుట్‌లెట్‌ను ప్రారంభించింది. ఈ రంగంలో దినదినాభివృద్ధిని సాధిస్తోంది. ఓర్పుతోనే మంచి జరుగుతుందని గుర్తు చేస్తూ కలల్ని నిజం చేసుకుంది మౌని. సినీపరిశ్రమలో ఎలాంటి సంబంధాలు లేకుండా తాను కన్న కలల్ని నిజం చేసుకున్న ప్రతిభావనిగా మౌని రాయ్ స్ఫూర్తి నింపుతోంది.

**నటప్రస్థానం:** ఏక్తా కపూర్ క్యుంకి సాస్ భీ కభీ బహు థీతో టెలివిజన్ రంగంలోకి ప్రవేశించినప్పటి నుండి మౌని రాయ్ చాలా ఎత్తుకు ఎదిగారు. నాగిన్‌లో నటించిన తర్వాత ఈ బ్యూటీ బాగా పాపులరైంది. మౌని 2018లో అక్షయ్ కుమార్ గోల్డ్ చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. గత సంవత్సరం అయాన్ ముఖర్జీ భారీ చిత్రం బ్రహ్మాస్త్రలో కనిపించింది. ఇటీవల ఆమె జుబిన్ నౌటియాల్‌తో కలిసి డోటరా అనే మ్యూజిక్ వీడియోలో కూడా కనిపించింది. మౌని రాయ్ చివరిసారిగా వెబ్ సిరీస్ సుల్తాన్ ఆఫ్ ఢిల్లీలో కనిపించింది. ఇటీవలి ఇంటర్వ్యూలో మౌని సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ .. బ్రహ్మాస్త్ర వంటి ప్రాజెక్టులు తనలోని నటి విషయమై ప్రజల అభిప్రాయాన్ని మార్చాయని అంది. బ్రహ్మాస్త్ర పూర్తిగా భిన్నమైనది. గోల్డ్, రా .. మేడ్ ఇన్ చైనా లోను విలక్షణ పాత్రలకు మంచి గుర్తింపు దక్కిందని మౌని తెలిపింది.

## నందిని రాయ్.. చలిలో కూడా హీటెక్కించే అందం..

టాలీవుడ్ లో అందం, టాలెంట్ ఉన్నా చాలా మంది హీరోయిన్లకు ఛాన్సులు రాట్లేదు. అలాంటి వారిలో హైదరాబాదీ అమ్మడు నందినీ రాయ్ ఒకరు. చాలా ఏళ్ల క్రితమే ఇండస్ట్రీకి వచ్చిన ఈ బ్యూటీ.. అవకాశాలను మాత్రం అందుకోవడంలో విఫలం అవుతోంది. అందుకే అడపాదడపా సినిమాలు చేస్తోంది. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఓ రేంజ్ లో సందడి చేస్తుంటుందీ బ్యూటీ. తన అభిమానులను అలరిస్తూనే ఉంటోంది. తన కెరీర్‌కు సంబంధించిన ఎన్నో విషయాలను ఫ్యాన్స్‌తో పంచుకుంటోంది. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫొటోలు పోస్ట్ చేస్తూ ఫాలోవర్లను పెంచుకుంటోంది. ఫుల్ క్రేజ్ సంపాదించుకుంటోంది. సోషల్ మీడియాలో ఈ మధ్య గ్లామర్ డోస్ పెంచేసి మరీ అందాలను ఆరబోస్తోంది నందినీ రాయ్. అదిరే పోజులతో పిక్స్, వీడియోలను షేర్ చేస్తోంది. కుర్రకారు మతులు పోగొట్టేస్తోంది. తాజాగా బ్లాక్ బికినీ కమ్ డ్రెస్ లో దిగిన ఫొటోలను షేర్ చేసింది. Casual vibes and comfort all in one అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఆ పిక్స్ వైరల్ గా మారాయి. ఫ్యాన్స్ లైకుల వర్షం కురిపిస్తున్నారు. అందమంటే నందినీ రాయ్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన నందినీ రాయ్



సినిమాల కంటే ముందు మోడలింగ్ రంగంలో సందడి చేసింది. మిస్ హైదరాబాద్, మిస్ ఆంధ్రప్రదేశ్‌గా ఎంపికైంది. దీంతో ఈ బ్యూటీ ఒక్కసారిగా పాపులర్ అయింది. నేషనల్ లెవెల్ లో ఎన్నో బ్రాండ్లకు అంబాసిడర్ గా వ్యవహరించింది. ఆ సమయంలో ఫ్యామిలీ ప్యాక్ అనే బాలీవుడ్ మూవీతో హీరోయిన్ గా మారిపోయింది. ఆ తర్వాత మాయ సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. అలా కొన్ని సినిమాల్లో నటించినా గుర్తింపు తెచ్చుకోలేకపోయింది. అదే సమయంలో బిగ్ బాస్ రెండో సీజన్ లో పార్టిసిపేట్ చేసే ఛాన్స్ కొట్టేసింది. చక్కని ఆట, క్యూట్ లుక్స్‌తో అందరి దృష్టినీ ఆకర్షించింది. కానీ ఆ షో తర్వాత హీరోయిన్ గా అవకాశాలు వస్తాయని భావించినా వర్కౌట్ కాలేదు. ఇటీవలే గాలి వాన సిరీస్ తో పాటు వారిసు, భాగ్ సాలే మూవీల్లో సపోర్టింగ్ రోల్స్ చేసింది. మరికొన్ని వెబ్ సిరీస్‌లు, సినిమాలు చేస్తూ బిజీగా గడుపుతోంది. సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంటూ సినిమా ఛాన్సుల కోసం ట్రై చేస్తోంది.



# పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం..!!

తెలంగాణ ప్రభుత్వం సంక్రాంతి పండుగకు సంబంధించి అధికారికంగా పాఠశాలలకు సెలవులను ప్రకటించింది. జనవరి 12 నుంచి 17వ తేదీ వరకు సెలవులు ఉంటాయని తెలిపింది. మిషనరీ స్కూళ్లకు మినహా అన్ని స్కూళ్లకు ఈ సెలవులు వర్తిస్తాయని పేర్కొంది. ఈ అకాడమిక్ ఇయర్‌లో ఇవే చివరి లాంగ్ హాలీడేస్ కానున్నాయి. సంక్రాంతి సెలవుల వేళ ప్రయివేటు క్లాసుల పేరుతో తరగతులు నిర్వహించే ప్రయివేటు విద్యా సంస్థలకు ప్రభుత్వం హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం సంక్రాంతి పండుగకు సంబంధించి అధికారికంగా పాఠశాలలకు సెలవులను ప్రకటించింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో జనవరి 12 నుంచి 17వ తేదీ వరకు సెలవులు ఉంటాయని ప్రభుత్వం పేర్కొంది. పాఠశాలలకు ఈసారి సంక్రాంతికి అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం ఆరు రోజుల సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. జనవరి 12 నుంచి 17 వరకు సెలవులు ఉన్నాయి. ప్రయాణికులకు గుడ్‌న్యూస్: సంక్రాంతికి 32 ప్రత్యేక రైళ్లు, ఈ మార్గాల్లో అయితే మిషనరీ పాఠశాలలకు మాత్రం ఈ హాలీడేస్ నుంచి మినహాయింపు ఉంది. సంక్రాంతి సెలువులు జనవరి 12న ప్రారంభం అయితే.. మరుసటి రోజే రెండో శనివారం, తర్వాత ఆదివారం వస్తున్నాయి. 14 ఆదివారం భోగి పండుగ కాగా.. 15వ తేదీ సోమవారం సంక్రాంతి పర్వదినం జరుపుకోనున్నారు. సంక్రాంతి తరువాత జనవరి 16, 17న ప్రభుత్వం పాఠశాలలకు అదనంగా సెలవులు ఇచ్చింది. దీంతో ఆరు రోజుల పాటు స్కూల్స్‌కు హాలీడేస్ రానున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థలు సిలబస్ పేరిట పండుగ హాలీడేస్‌లలో క్లాసులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ చెబుతోంది. కాగా జనవరి 25న ఆదివారం, 26 రిపబ్లిక్ డే వరుస సెలవులు రాబోతున్నాయి. ఇక, ఇప్పటికే పదో తరగతి, ఇంటర్ పరీక్షా షెడ్యూళ్లను ప్రభుత్వం ప్రకటించింది. ఈ సెలవులు పూర్తవుతూనే విద్యార్థులు పూర్తిగా పరీక్షల మూడ్ లోకి వెళ్లనున్నారు. దీంతో, సంక్రాంతి సెలవుల కోసం ప్రభుత్వం నుంచి ప్రకటన కోసం నిరీక్షిస్తున్న సమయంలో తెలంగాణ విద్యా శాఖ సెలవుల పైన ప్రకటన చేసింది.

# ఆరు గ్యారెంటీల దరఖాస్తు కోసం 6వ తేదీ లాస్ట్..గడువు పెంపు?



హైదరాబాద్ : తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం అభయ హస్తం పేరుతో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. ఈ క్రమంలో ఆయా పథకాల అమలు కోసం ప్రజల నుంచి డిసెంబరు 28 నుంచి 2024 జనవరి 6 వరకు అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులలో జరిగే గ్రామసభలలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే ఈ అప్లికేషన్ల స్వీకరణ కోసం కొన్ని రోజులు మాత్రమే సమయం ఇవ్వడం వల్ల పలువురు ప్రజలు తాము ఇంకా అప్లై చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో దరఖాస్తు గడువు పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ఈ దరఖాస్తుల స్వీకరణకు ఇంకా మూడు రోజులు మాత్రమే సమయం ఉన్న నేపథ్యంలో ఆయా గ్రామ సభల దగ్గరకు పెద్ద ఎత్తున ప్రజలు చేరుకుంటున్నారు. అనేక మంది తెల్లవారు జాము నుంచే గ్రామ సభల ప్రాంతాల వద్దకు చేరుకుని లైన్లలో పోటీ పడి అప్లికేషన్లను ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచుతారా లేదా అనేది తెలియాల్సి ఉంది. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులకు ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి మరి. ఈ పథకాల కోసం స్వీకరించే దరఖాస్తు నాలుగు పేజీలు ఉండగా.. అందులో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత, యువ నిధి మినహా 5 హామీల కోసం దరఖాస్తు ఉంది. ఒక్కో పథకానికి విడివిడిగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ఇప్పటికే ప్రకటించారు.

ఏదైనా పథకానికి అర్హులైన వారు దరఖాస్తు ఫారంలో ఆ పథకానికి అవసరమైన వివరాలను మాత్రమే నింపాలని అధికారులు స్పష్టం చేశారు. అంతేకాదు మీరు అన్ని స్కీమ్‌లకు అర్హులైనట్లయితే ఒక్క అప్లికేషన్‌లో సంబంధిత వివరాలను పూర్తి చేస్తే సరిపోతుందని అన్నారు. ఈ క్రమంలో దరఖాస్తు ఫారంతోపాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫొటో కాపీలు అందజేయాలని పేర్కొన్నారు.




దిల్లీ: సార్వత్రిక ఎన్నికల ముందు చమురు ధరలను కేంద్రం తగ్గిస్తుందంటూ వస్తున్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. చమురు ధరల తగ్గింపుపై జరుగుతున్న ప్రచారం అనేది పూర్తిగా ఊహాజనితమని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురీ పేర్కొన్నారు. చమురు ధరల తగ్గింపుపై ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో ఎలాంటి చర్చలూ జరగలేదని బుధవారం విలేకరుల సమావేశంలో స్పష్టతనిచ్చారు. ఓ వైపు అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం, మరోవైపు సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తుందంటూ వార్తలు వచ్చాయి. లీటర్‌కు రూ.6 మేర తగ్గే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. ఒకప్పటితో పోలిస్తే చమురు ధరలు గరిష్ఠాల నుంచి భారీగా తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఆ మేర వినియోగదారులకు ప్రయోజనాన్ని బదిలీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోందంటూ వార్తలు వచ్చాయి. అయితే, అలాంటిదేమీ లేదంటూ ప్రచారానికి పురీ చెక్ పెట్టారు. అంతర్జాతీయంగా చమురు ధరలు ఒడుదొడుకుల కారణంగా అటు అభివృద్ధి చెందిన, పొరుగు దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం పెరిగాయని అన్నారు. భారత్‌లో మాత్రం ధరలు స్థిరంగా ఉన్నాయని గుర్తు చేశారు. దక్షిణాసియా దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40-80 శాతం మేర పెరిగాయని, పశ్చిమ దేశాల్లోనూ ధరలు పెరిగాయని చెప్పారు. అదే సమయంలో భారత్‌లో 2021 నవంబర్, 2022 మే నెలలో రెండు సార్లు చమురు ధరలు తగ్గాయని మంత్రి గుర్తుచేశారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు, ఎల్పీజీ దిగుమతిదారుగా ఉందని పురీ చెప్పారు. ఎల్ఎన్‌జీ దిగుమతి, రిఫైనరీ, ఆటోమొబైల్ మార్కెట్ పరంగా నాలుగో స్థానంలో ఉందన్నారు. ప్రపంచ మార్కెట్‌లో ఎప్పుడికప్పుడు చమురు ధరలు తీవ్రమైన ఒడుదొడుకులు ఎదుర్కొంటూ ఉంటాయని చెప్పారు. అలాంటి స్థితిలో ఏ ప్రభుత్వానికి అయినా చమురు ధరలు తగ్గించడం కష్టంతో కూడుకున్న వ్యవహారమన్నారు.

ఈ క్రమంలోనే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో చమురు ధరల తగ్గింపుపై ఎలాంటి సంప్రదింపులూ జరగలేదని చెప్పారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు లాభాలు ప్రకటించినప్పటికీ.. చమురు ధరలు గరిష్ఠంగా ఉన్న సమయంలో రిఫైనరీలు భారీ నష్టాలు చవిచూశాయన్న అంశాన్ని గుర్తుచేశారు.

# లబ్ధిదారుల ఎంపికపై స్పష్టమైన ప్రకటన చేయాలి : ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్ : ప్రజాపాలన లబ్ధిదారుల ఎంపికపై స్పష్టమైన ప్రకటన చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని రాంగోపాల్ పేట డివిజన్‌లో పర్యటించారు. నల్లగుట్టలోని వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజాపాలన దరఖాస్తుదారులలో అర్హుల ఎంపిక విషయంలో స్పష్టత లేక అయోమయానికి గురవుతున్నారని, ఎంపిక ఎప్పటిలోగా పూర్తి చేస్తారని అధికారులను ప్రశ్నించారు. దరఖాస్తులో బ్యాంకు ఖాతా వివరాలు పేర్కొనలేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.






# తెలంగాణలో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు..!

తెలంగాణలో రికార్డుస్థాయిలో కిక్కెక్కింది. 2023లో రూ.36 వేల కోట్లకుపైగా విలువైన మద్యాన్ని మందుబాబులు తాగేశారు. 2022లో కంటే దాదాపు రూ.2వేల కోట్ల విలువైన మద్యాన్ని అధికంగా సేవించినట్లు తేలింది. ఈసారి ఎక్కువగానే ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.




## చనిపోయిన రైతుల పేరిట పంట రుణాలు.. దళారితో కుమ్మక్కై బ్యాంకర్ల అక్రమాలు!

సాధారణంగా బ్యాంకులో రుణం తీసుకోవాలంటే పెద్ద ప్రహసనమే అవుతుంది. ఎన్నో పత్రాలు మరెన్నో హామీలు అడుగుతూ బ్యాంకర్లు ముప్పుతిప్పలు పెడతారు. అలాంటిది ఓ చోట మాత్రం ఏకంగా చనిపోయిన వారి పేరు మీద పంట రుణం మంజూరు చేసి.. ఇతర ఖాతాల్లోకి బదిలీ చేశారు. పలువురు రైతులకు తెలియకుండా వారి రుణాలను రెన్యువల్ చేసి ఆ డబ్బులను వేరే ఖాతాల్లోకి మళ్లించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని నమ్మిన రైతులు నిలువునా మునిగారు.




హైదరాబాద్: ఓ వ్యక్తి గుర్రం మీద తిరుగుతూ ఫుడ్ డెలివరీ చేయడం చూపరులను ఆకట్టుకుంది. మంగళవారం పెట్రోల్ కోసం బంక్ వద్ద లైన్‌లో నిలబడిన ఓ జొమాటో డెలివరీ బాయ్.. ఇంధనం దొరకకపోవడంతో విసుగుచెంది వాహనాన్ని పక్కనపెట్టాడు. అనంతరం గుర్రంపై వెళ్లి ఆహారాన్ని అందించాడు. ఇది హైదరాబాద్ చంచల్‌గూడ పరిసర ప్రాంతాల్లో జరిగింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

# నేడు హైదరాబాద్‌కు ఏపీ సీఎం జగన్.. ఎవరిని కలుస్తారంటే..?



హైదరాబాద్: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రేపు(గురువారం) హైదరాబాద్‌కు రానున్నారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జగన్ పరామర్శించనున్నారు. డిసెంబర్ 8న ఫామ్‌హౌజ్‌లోని బాత్‌రూంలో జారి పడటంతో కేసీఆర్ తుంటి ఎముకకు తీవ్ర గాయమైంది. వెంటనే కేసీఆర్‌ను కుటుంబసభ్యులు యశోదా ఆస్పత్రికి తరలించారు.

ఈ సందర్భంగా వైద్యులు పరీక్షించి తుంటి ఎముక ఫ్యాక్చర్ అయ్యిందని ఆపరేషన్ చేయాలని చెప్పారు. అనంతరం యశోదా వైద్యుల ఆధ్వర్యంలో కేసీఆర్‌కు తుండి ఎముక మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు.

వారం పాటు ఆస్పత్రిలో చికిత్స అనంతరం డిసెంబర్ 15న కేసీఆర్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి నందినగర్‌లోని పాత ఇంటికి వెళ్లారు. ఇంట్లో కేసీఆర్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

# సావిత్రి బాయి ఫూలే సేవలు చిరస్మరణీయం : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల : సావిత్రి బాయి పూలే సేవలు మరువలేనివని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వేములవాడ పట్టణంలోని 17వ వార్డులో ప్రజా పాలన సభ హాజరై మాట్లాడారు. స్త్రీ విద్య కోసం సావిత్రి బాయి ఎంతో కృషి చేశారన్నారు. తన ఇంటినే పాఠశాలగా మార్చి ఎంతో మందికి విద్యను అందించారని ప్రశంసించారు. తన భర్త జ్యోతిరావుపూలేతో కలిసి ఆనేక సేవా కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. అలాంటి మహనీయుల బాటలో మనం నడువాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం చెప్పినట్లుగా ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. దరఖాస్తుల కోసం ఎవరు కూడా ఆందోళన పడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరిని నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com